ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్
బుధవారం 2 ఆగస్టు 2017 | 20



వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



3

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలకు కృషి చేస్తా, వసతి గృహాలు పరిశుభ్రంగా ఉంచాలి, విద్యార్థులు క్రమ శిక్షణతో ఉండేలా అధికారులు చూడాలి. ఎక్కడైనా మరుగుదొడ్లు, భవనాల పైకప్పుల మరమ్మతులు ఉంటే పరిష్కరించాలి. సంక్షేమ శాఖ అధికారులు వాట్సాప్ గ్రూపును తయారు చేసి సమస్యలను తెలియజేయాలి. అత్యవసర సమయంలో వసతి గృహాల్లో వార్డెన్లు అందుబాటులో లేని పక్షంలో ఇతరులకు బాధ్యత అప్పచెప్పి వెళ్లాలి.

- కలెక్టర్ దివ్య దేవరాజన్

కరువు ఛాయలు

- ముఖం చాటేసిన వరణుడు.!
- నెల రోజులుగా నీరు పారేలా పడని వాన..
- ఎండుతున్న వరి నారు మడులు
- వాడిపోతున్న మొక్కజొన్న తదితర పంటలు
- దిక్కుతోచని స్థితిలో రైతాంగం

ఖరీఫ్‌లో ఇప్పటి వరకు సాధారణానికి మించిన వర్షపాతం నమోదైనప్పటికీ రైతుల్లో కలవరం మొదలైంది. వాతావరణంలో మార్పులు, చిన్నపాటి వర్షం చినుకులు కురుస్తున్నప్పటీకీ పంటలకు సరిపోవడం లేదు. నల్లరేగడి భూముల్లో పంటలు కాస్త బాగున్నప్పటీకీ చెలక భూముల్లో మొక్కజొన్న తదితర పంటలు ఎండుముఖం పడుతున్నాయి. జూన్‌లో కురిసిన వర్షాలు, జూలైలో కానరాకుండా పోయాయి. వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.



వర్షాలు కురవాలని కొడంగల్‌లో భజన



11

మర్పల్లిలో వాడుముఖం పట్టిన మొక్కజొన్నకు బిందెలతో నీళ్లు పోస్తున్న మహిళా రైతులు



లక్నాపూర్ ప్రాజెక్టులో అడుగు చేరిన నీరు

కూలీల ఖాతాలకు 'ఆధార్'

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. నిర్ణీత గడువులోగా తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానం చేసుకోని వారికి ఉపాధి కూలి చెల్లించరు. నగదు రహిత లావాదేవీలు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు చెల్లించే కూలి డబ్బులను ఇక బ్యాంకు ఖాతాల్లోనే వేయనున్నారు. తపాలా కార్యాలయాల ద్వారా చెల్లిస్తూ వస్తున్న కూలి డబ్బులకు ఇక తెరపడనుంది. కూలీల వివరాలను పంచాయతీల వారీగా వైబ్‌సైట్‌లో నమోదు చేయనున్నారు. వివరాలు 7లో...





7 లో

కేజీబీవీకి తాళం

సహచర విద్యార్థిని మృతితో ఇళ్లకు వెళ్లిన విద్యార్థినులు

సబ్‌కలెక్టర్ తీరు పై ఫిర్యాదు

కొడంగల్‌బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి 5

రెండు బస్సులు,కారు ఢీ

రెండు బస్సులు, ఒక కారు ఢీ కొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం వికారాబాద్ పట్టణంలో జరిగింది. భృంగీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సు సాయంత్రం విద్యార్థులను ఇళ్ల వద్ద వదిలేందుకు బయలు దేరింది. వికారాబాద్ ఎన్నెపల్లి సమీపంలో వేగంగా వచ్చిన స్కూల్ బస్సు అదుపు తప్పి పరిగి నుంచి వస్తున్న కారును ఢీకొడుతూ అదే సమయంలో హైదరాబాద్ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. వివరాలు 7లో..



ప్రమాదంలో దెబ్బతిన్న స్కూల్ బస్సు

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

పోకిరీల ఆట కట్టించేందుకే 'షీటీమ్స్'

- వికారాబాద్ జిల్లాలో మూడు బృందాలు
- క్షణికావేశాలతోనే భార్యభర్తల మధ్య గొడవలు
- కౌన్సెలింగ్‌కే తొలి ప్రాధాన్యం
- రాజీ కుదరకపోతేనే కేసులు
- జిల్లా మహిళా పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో, జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి నిర్మల




వికారాబాద్ అర్బన్: షీ బృందాలను చాలా పకడ్బందీగా జిల్లాలో నిర్వహిస్తున్నాం. సబ్ డివిజన్‌కు ఒక బృందం వంతున జిల్లాలో మొత్తం మూడు షీ బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కొక్క షీ బృందంలో ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. అందులో ఒక హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉంటారు. వీరు నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ పోకిరి వేషాలు వేసే వాళ్లపై నిఘా ఉంచుతారు. ఎక్కువగా రద్దీ ఉండే బస్టాండ్, రైల్వేస్టేషన్ వంటి ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద వీరు మఫ్టీలో ఉండి పోకిరీల ఆగడాలపై నిఘా పెడతారు. ఇప్పటి వరకు జిల్లాలో రెండు కేసులు నమోదు చేయడం జరిగింది. అందులో ఒకటి నవాబుపేట మండలం ఎక్‌మామిడిలో కాగా, వికారాబాద్‌లో మరో కేసు నమోదైంది. పదుల సంఖ్యలో షీ బృందాలు పట్టుకొచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతోంది. కౌన్సెలింగ్ ఇచ్చిన తరువాత కూడా ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై ఖచ్చితంగా కేసు నమోదు చేయడం జరుగుతుంది. ఇందుకోసం ప్రతి కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం వికారాబాద్ పట్టణంలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో షీటీమ్ బృందాల పనితీరు, నిర్వహణపై అవగాహన కల్పిస్తూ అర్థమయ్యే విధంగా తెలియజేస్తున్నాం. ఈ విషయంలో జిల్లా ఎస్పీ అన్నపూర్ణ ప్రత్యేక చొరవ తీసుకొని షీటీమ్స్‌ను ముందుకు నడిపిస్తున్నారు. వికారాబాద్ తరువాత జిల్లాలోని అన్ని మండలాల్లో, వసతి గృహాల్లో షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. యువతీ, యువకులకు టీనేజీలో జరిగే అనర్థాలు, ఆ తరువాత ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడం జరుగుతోంది. తప్పు చేసిన వారు తప్పించుకునే ప్రసక్తి లేదు. ఇందుకోసం పోలీసు యంత్రాంగం తరపున సీసీ కెమెరాలు, షీటీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో వికారాబాద్‌లోనే ఏకైక మహిళా స్టేషన్ ఉంది. దీంతో ఎక్కువ శాతం ఇక్కడకు అత్తమామలు, వరకట్నం వేధింపులు, భర్త వేధింపులకు సంబంధించిన కేసులు ఇక్కడకు వస్తుంటాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తరువాత అక్కడ పరిష్కారం కాని పక్షంలో ఇక్కడకు ఫిర్యాదుదారులు వస్తుంటారు. ఎక్కువ శాతం క్షణికావేశం, భార్య భర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోక పోవడం వల్ల వివాదాలు తలెత్తుతుంటాయి. అలాంటి వారికి ఇక్కడ కౌన్సెలింగ్ ఇస్తాం. రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా తమ తీరు మార్చుకోకుంటే వారు కోరిన విధంగా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుంది. ఈ మధ్య జరిగిన లోక్ అదాలత్‌లో వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ నుంచి 42 కేసులను రాజీ కుదర్చడం జరిగింది. లోక్ అదాలత్ ద్వారా ఒకసారి కేసు కొట్టివేయడం జరుగుతుంది. రాజీ కుదుర్చుకోవడం ద్వారా కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుంది. ఈ విధంగా రాజీ మార్గాన్ని ఎంచుకుని కేసులను పరిష్కరించుకుంటున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు మహిళా పోలీస్ స్టేషన్‌కు 297 ఫిర్యాదులు రాగా అందులో 220 ఫిర్యాదులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించగా, 37 కేసులు నమోదు చేశాం. వీలైనంత వరకు కేసులను రాజీ కుదిర్చేందుకే ప్రయత్నిస్తుంటాం. వినని పక్షంలో వారి ఫిర్యాదులను స్వీకరించి కేసు నమోదు చేయడం జరుగుతుంది.

బిందుసేద్యానికి అడ్డుకట్ట

- మరమ్మతు లేక పైపుల్లో పేరుకుపోతున్న కాల్షియం
- నిర్వహణను పట్టించుకోని అధికారులు

యాచారం: సూక్ష్మ బిందుసేద్యం పరికరాల మరమ్మతుల బాధ్యతను ఆయా కంపెనీలు విస్మరించడంతో రంగారెడ్డి జిల్లాలోని రైతుల అవస్థలు పడుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ సాగు చేయడం అనే నినాదంతో రంగారెడ్డి జిల్లాలో 2003 సంవత్సరంలో (మైక్రోఇరిగేషన్‌ప్రాజెక్టు) సూక్ష్మ సేద్యాన్ని అమలులోకి తెచ్చారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రైతులకందిస్తున్నారు. ఈ సూక్ష్మ బిందు సేద్యం మెయింటెన్స్ సరిగ్గా లేక రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. చాలా మంది రైతులకు డ్రిప్ మెయింటెన్స్‌ను కంపెనీలు విస్మరించడంతో రైతులే తోటి రైతుల సూచనలతో బాగు చేసుకుంటున్నారు.



చౌదర్‌పల్లిలో డ్రిప్‌తో సాగవుతున్న కూరగాయల తోట

పరికరాల సరఫరా ఇలా

రంగారెడ్డి జిల్లాలో రాయితీపై 2003 నుంచి బిందుసేద్యం పథకం ప్రారంభమైంది. ఐదేళ్ల వ్యవధిలో 3వేల హెక్టార్లలో బిందుసేద్యం పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా వాటి ఉపయోగం, వినియోగం మాత్రం చాలా పేలవంగా ఉంది.

ఇలా మారుతున్నాయ్..

బిందుసేద్యం పరికరాలకు సంబంధించి నీటిని మొక్కలకు అందించే కీలకమైన పైపుల్లో నీటిలోకలిగి ఉండే కాల్షియం, మెగ్నీషియం, వంటి టీడీఎస్ లవణాలు పేరుకుపోయి గడ్డకడుతున్నాయి. ఫలితంగా పైపుల నుంచి నీరు సాఫీగా వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి.

ఏం చేయాలంటే..

పైపుల్లో పేరుకుపోయిన కాల్షియం, మెగ్నీషియం లవణాల గడ్డలు, పైపులు పిల్లర్ల నుంచి తొలగించేందుకు కనీసం ఏడాదికి ఒక్కసారైన యాసిడ్ ట్రీట్‌మెంట్ ద్వారా శుభ్రం చేయాలి.

ఎవరు చేయాలి..

యాసిడ్ ఖర్చులు రైతులే భరించినా టెక్నీషియన్ల సేవలను మాత్రం వీటిని అమర్చిన కంపెనీలే రైతులకు ఉచితంగా ఐదేళ్లపాటు అందించాల్సి ఉంది. ఐదేళ్ల నుంచి రైతులకు ఆయా సంస్థలు ఈ సేవలను అందించడం మానేశాయి.

ముందుకు రాని కంపెనీలు

కూరగాయల సాగు, పండ్లతోటల సాగుకు బిందు సేద్యం పరికరాలు అమర్చుతున్నారు. రైతులకు ఆయా కంపెనీల సేవలందక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. పొలంలో బిందుసేద్యం పరికరాలు అమర్చింది మొదలు ఏళ్ల గడిచినా మళ్లీ ఆయా కంపెనీల ప్రతినిధులు తమ వైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఐదేళ్లు ఉచిత సేవలు అందించాలి

బిందుసేద్యం పరికరాలు అమర్చిన తరువాత ఐదేళ్ల పాటు ఆయా కంపెనీలు వీటి నిర్వాహణ విషయంలో ఏసమస్య వచ్చినా ఐదేళ్ల ఉచితంగా సేవలందించాల్సి ఉంది. ఈ విష యంలో ఉద్యానవనశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పడేస్తున్నారు..

చాలా గ్రామాలలో డ్రిప్‌ల మెయింటెన్స్ సరిగ్గా లేక పోవడంతో డ్రిప్ పరికరాలు పాడైపోయి పొలానికి నీరందించడం లేదు. డ్రిప్ పరికరాలు మరమ్మతులకు గురికావడంతో వాటిని రైతులు తొలగిస్తున్నారు. పైప్ నీరు పోయకపోవడంతో మరమ్మతు చేసే విషయం తెలియక రైతులు వాటిని తొలగించి పాడేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

అన్నదాతలకు బిందుసేద్యం పరికరాలను సరఫరా చేసిన కంపెనీలు ప్రతి మూడు నెలలకోమారు యాసిడ్ ట్రీట్‌మెంట్ చేసి రైతులకు చూపాలి. రైతు కోరిన ప్రకారంగా పైపులకు శుద్ధి చేసి చూసి నీరు రాని పరిస్థితుల్లో వాటిని తొలగించి కొత్త పైప్‌లందించాలి. డ్రిప్‌లు బాగున్నాయా లేదా అనేది చూడాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇక్కడే అధికం

యాచారం మండలంలోని గడ్డమల్లాయగూడ, గున్‌గల్, మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి గ్రామాలలో మాత్రమే కూరగాయలసాగు అధికంగా చేస్తున్నారు. గడ్డమల్లాయగూడ గ్రామంలో డ్రిప్ పని చేయని కొందరు రైతులు వారే కెమికల్ తెచ్చుకొని బాగు చేసుకున్నారు. ఇక్కడ వెంకటరెడ్డి అనే రైతు స్వత హాగా భారీ గడ్డ ఏర్పాటు చేసి దానిపై నీటి టాంకు కట్టి దాంట్లోకి నీరు పెట్టి డ్రిప్ యంత్రం పెట్టి కూర గాయలు సాగు చేసుకుంటున్నారు.

మేమే బాగు చేసుకుంటున్నం


మేమే డ్రిప్ పైపులను బాగు చేసుకుంటున్నం. సూది లేదా దాని సమానమైన పరికరంతో డ్రిప్ పైప్‌లో ఇరుకున్న వ్యర్థాలను తొలగించి బాగు చేసుకుంటున్నం. డ్రిప్ పైప్ పాడైనట్లు కంపెనీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి డ్రిప్ పరికరాలు కొంటే కంపెనీ అధికారులు బాగు చేయడం లేదు.



- గౌరనర్సింహ, చౌదర్‌పల్లి సర్పంచ్, రైతు

కంపెనీ వాళ్లకు చెప్పినా బాగు చేయరు

డ్రిప్ పాడైనట్లు డ్రిప్ కంపెనీ అధికారులకు తెలిపినా వారు రారు.. చూడరు. ఊర్ల తోటి రైతులనడిగి బాగు చేసుకుంటున్నం. చాలా మటుకు పాడైన డ్రిప్ పైప్‌లు పారేస్తున్నారు. కాలం చెల్లిన వాటి స్థానంలో కొత్తగా పైప్‌లు ఇవ్వాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. గింత అన్యాయం ఎక్కడ లేదు.



- నారాయణ రైతు చౌదర్‌పల్లి

అన్ని విధాల ఆదుకుంటున్నం

ఏయే రైతు ఏకంపెనీ నుంచి డ్రిప్ పైప్‌లు కొన్నారో తెలుసుకొని వాటిని ఆయా కంపెనీల చేత బాగు చేయించడం కోసం చర్యలు తీసుకుంటున్నం. డ్రిప్ పైప్‌లు రైతులే బాగు చేసు కోవడం బాధేస్తుంది. ఇక నుంచి కంపెనీల అధికారులతో డ్రిప్‌ను బాగు చేయించడం కోసం చర్యలు తీసుకుంటాం.



- యాదగిరి డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి

ఉపవాసం చేసేది ఎందుకో తెలుసా..

భక్తి

బషీరాబాద్ : ఉప అనగా సమీపం అని, వాసం అనగా నివసించడం అని అర్థం. ఉపవాసమనగా దేవతా సమీపంలో గడపడం అని అర్థం. భారతీయ సంస్కృతి ప్రకారం ప్రతి నెలలో రెండుసార్లు వచ్చే ఏకదశి తిథితో పాటు మహాశివరాత్రి, కృష్ణాజన్మాష్టమి, రామ నవమి వంటి పర్వదినాల్లో సైతం ఉపవాసం ఉండటం సంప్రదాయం. దాంతో పాటు ఇష్టదేవత, కులదేవతలకు సంబంధించిన రోజుల్లో సైతం ఉపవాసం ఉండటం వల్ల మానసిక ప్రశాంతత, శరీరక విశ్రాంతి లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఉపవాసం ఉండే రోజుల్లో ఆయా దేవుళ్లకు ఇష్టమైన పదార్థాలు నివేదించి వాటినే స్వీకరించడం ద్వారా దేవుళ్ల కృపకు పాత్రులవుతారు. ఉపవాసం ఉన్న రోజుల్లో శక్తి మేరకు అతి తక్కువ ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఏకాగ్రతను పొందడమే కాకుండా పలు వ్యాధుల నుంచి విముక్తులవుతారు. నిరాహారం, జలాహారం ఫలహారాలతో ఉపావాసాలుండటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కనీసం ప్రతి పదిహేను రోజులకోకసారి ఉపవాసం పేరిట మితాహారం తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థకు అవసరమైన విశ్రాంతి దొరుకుతుంది. ఫలితంగా అది మరింత ఉత్తేజంగా పనిచేయగలుగుతుందని సైన్స్ సైతం నిరూపించడం మనకు తెలుసు.



- జయరాంచారి, అర్చకులు హనుమాన్ మందిర్ బషీరాబాద్

ఏకీకృత సర్వీస్‌రూల్స్‌తో పర్యవేక్షణ పటిష్ఠం కావాలి

ఉద్యోగపర్వం

- ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎండీ. రహీంఖాన్



వికారాబాద్ రూరల్: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్‌రూల్స్‌కి రాష్ట్రపతి ఆమోద ముద్రతో తెరపడింది. వెంటనే ఇన్‌చార్జి పాలనను తొలగించాలి. విద్యాశాఖలో నెలకొన్న తీవ్రమైన కొరత సమసి పోయేలా చూడాలి. విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు, స్థాన చలనాలు జరపాలి. ఆగిపోయిన డిప్యూటీ ఈవో, ఎంఈవో, డైట్ లెక్చరర్ల తదితర పర్యవేక్షణ పోస్టుల భర్తీని ప్రభుత్వం చేపట్టాలి. విద్యా వ్యవస్థలో బలోపేతం చేయాలి. రాష్ట్ర పునర్విభజన ఏతు/సెక్షన్ 97 ప్రకరం 71(డి)ని రాష్ట్రానికి ఉపయోగించుకునే క్యాడర్లను కొత్తగా నిర్మించుకునే అవకాశం కల్పించాలి. అన్ని సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సర్వీస్‌రూల్స్ అమలుపై చర్చించి పదోన్నతులు కల్పించాలి. ప్రతి పాఠశాలకు ఒక నైట్ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. 2006, 2012 సీపీఎస్ విధానాన్ని తొలగించి ఉపాధ్యాయులకు పెన్షన్ విధానం కల్పించాలి. ఈ విద్యాసంవత్సరానికి మధ్యాహ్న భోజన బిల్లులు మంజూరు చేయాలి.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

జిల్లా కలెక్టర్ దివ్య

వికారాబాద్ అర్బన్ : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల సమస్యలతో పాటు మౌలిక సదుపాయాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతోపాటు ఆడుకోవడానికి క్రీడాసామాగ్రిని అందించాలన్నారు. అంతేగాక జ్ఞానాన్ని పెంపొందించేందుకుగాను వివిధ రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులను వసతి గృహాల్లోని సమస్యలను తెలపాలని కలెక్టర్ అడగ్గా మరుగుదొడ్లు, నీరు, విద్యుత్ సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వీటిపై తక్షణ చర్యలు తీసుకుంటానన్నారు. మరుగుదొడ్లు, భవనాల పైకప్పుల మరమ్మతులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని డీఎస్‌వో సీడీవోను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెల వసతిగృహాలపై సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. సం క్షేమ శాఖ అధికారులు వాట్సాప్ గ్రూపును తయారు చేసి నెంబరును చేర్చి ఎప్పటికప్పుడు సమస్యలను తెలియజేయాలని సూచించారు. వార్డన్లు అత్యవసర సమయంలో వసతిగృహాల్లో అందుబాటులో లేనిపక్షంలో ఇతరులకు బాధ్యత అప్పచెప్పి వెళ్లాలని చెప్పారు. కళాశాలల విద్యార్థులు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొస్తూ బాలుర వసతి గృహం కొంపల్లిలో ఉండడం వల్ల రవాణా సౌకర్యానికి ఇబ్బందిగా ఉందనీ, బస్సులు సంఖ్యను పెంచాలని కోరారు. అంతేకాకుండా వసతి గృహంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరారు. కళాశాలల బాలికలు వసతి గృహంలో నీటి సమస్య అధికంగా ఉందనీ, ప్రస్తుతం అద్దె భవనంలో సదుపాయాలు సరిగ్గా లేవని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. లైబ్రేరి పుస్తకాలు ఉంచడానికి స్థలం లేక పోవడంతో ఇబ్బందిగా ఉందన్నారు. అలాగే రాత్రి వేళల్లో వాచ్‌మెన్,ఏఎన్ఎంను అందుబాటులో ఉంచాలని కోరారు. వీటిపై కలెక్టర్ స్పందిస్తూ బాలికల వసతి గృహాన్ని వేరే చోటుకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని డీఎస్ సీడీవో కలెక్టర్ ఆదేశించారు. అలాగే మిగతా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇప్పటికే కాస్మొటిక్ చార్జీలు అందలేదని, చెప్పులు, బ్యాగులు, ఆర్‌వోప్లాంట్ల మరమ్మతులు, విద్యుత్ సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమీక్షలో డీఎస్ సీడీవో హన్మంత్‌రావు, ఎస్‌డబ్ల్యూవో శ్వేత, సంక్షేమాధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దివ్య

హరితహారం లక్ష్యం పూర్తి చేయాలి......

హరితహారం కింద అటవీశాఖకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసేందుకు చర్యలుతీసుకోవాలని కలెక్టర్ దివ్య అటవీ శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అటవీ శాఖాధికారులతో హరితహారం పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యంత్రాల ద్వారా గుంతలను తవ్వి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టేకు మొక్కలకు డిమాండ్ ఉన్నందున వాటిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమీక్ష లో డీఎఫ్‌వో లక్ష్మి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు 153 దరఖాస్తులు ఆమోదం...

పరిశ్రమల స్థాపనకు 193 దరఖాస్తులు రాగా వాటిలో 153 దరఖాస్తులను ఆమోదించినట్లు కలెక్టర్ దివ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల స్థాపనపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. అధికారులు తమ శాఖల ద్వారా అందించే అనుమతులను పరిశీలించి త్వరలో మంజూరు చేయాలని ఆమె కోరారు. మిగతా యూనిట్లకు త్వరలో అనుమతులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

పరిశ్రమల యాజమాన్యాలకు నిర్దేశించిన హరితహారం లక్ష్యాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆమె సంబంధిత అధికారులకు సూచించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ సురేష్ పొద్దార్, ఎల్‌డీఎం శాస్త్రీ, ఇండస్ట్రీస్ జీఎం సమ్మయ్య, డీపీవో మాజీద్, డీటీవో దుర్గాదాస్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల నిర్మాణానికి అన్ని చర్యలు

తాండూరు : వికారాబాద్ జిల్లాకు కొత్తగా మంజూరైన ఆశ్రమ పాఠశాల నిర్మించేందుకు అనువైన స్థలాన్ని కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దివ్య తెలిపారు. మంగళవారం తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం లో ఆశ్రమ పాఠశాలల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖకు మంజూరైన నాలుగు ఆశ్రమ పాఠశాలలకు స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. ఈ పాఠశాలల భవన నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. భవన నిర్మాణం పూర్తయ్యేవరకు ఇతర భవనాలలో పాఠశాలల తరగతులు కొనసాగుతాయని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా బాలికలకు తాండూరు, పరిగిలో ఒక్కొక్కటి, బాలురకు కొడంగల్‌లో ఒక ఆశ్రమ పాఠశాల మంజూరైనట్లు తెలిపారు. ఈ పాఠశాలలకు స్థలం కేటాయింపు జరిగిందని తెలిపారు. తాండూరు, కొడంగల్‌లో మైనార్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలు, అదే విధంగా బాలికలకు వికారాబాద్‌లో ఒక పాఠశాల మంజూరైనట్లు చెప్పారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా వికారాబాద్, యాలాల బాలురకు ఒకటి, పరిగి, బొంరాస్‌పేట్‌లో బాలికలకు ఒక్కొక్కటి చొప్పున మంజూరైన ఆశ్రమ పాఠశాలలకు స్థలం కేటాయింపు కోసం త్వరలో ప్రతిపాదనలు పంపించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ సందీప్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీసీవో శారద, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కన్వీనర్ కం ప్రిన్సిపాల్ రవిప్రకాష్, గిరిజన సంక్షేమ శాఖ నుంచి వెంకటేశం, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఇ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సెల్ టవర్ అనుమతులు రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్, ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

రిలయన్స్ జియో టవర్ ఏర్పాటుకు బల్దియా అనుమతులు

కాలనీవాసుల తిరుగుబాటుతో రద్దు

తాండూరు : తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లి సర్వేనెంబర్ 54/ఎ ప్లాట్‌నెంబర్ 2/ఎలో రిలయన్స్ జియో టవర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిన బల్దియా కాలనీవాసులు వ్యతిరేకించడంతో రద్దు చేసింది. పట్టణంలోని చంద్ర థియేటర్ సమీపంలో మంగళవారం జియో సెల్ టవర్ ఏర్పాటు పనులు జరుగుతుండగా, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌తోపాటు కాలనీ వాసులు అడ్డుకున్నారు. సెల్‌టవర్ పనులు నిలిపి వేయాలని కాలనీ వాసులు మున్సిపాలిటీలో ఛైర్‌పర్సన్ సునీతాసంపత్, కమిషనర్ సంతోష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎట్టి పరిస్థితుల్లో సెల్ టవర్ పనులు జరగనివ్వమని ఛైర్‌పర్సన్, కమిషనర్‌కు తేల్చి చెప్పడం బల్దియా ఇచ్చిన అనుమతులు నిలిపివేస్తూ మరో ఆర్డర్ జారీ చేశారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

కులకచర్ల : మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మండల పరిధిలోని కుస్మసముద్రం గ్రామ పంచాయతీ గట్టన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య భార్య ప్రభావతి గతనెల 30న పొలం దగ్గర పనిచేస్తుంది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాహం వేస్తుంది నీళ్లు ఇవ్వమని అడిగారు. దీంతో ఆమె నీళ్లుఇవ్వగా ఓ వ్యక్తి తాగుతుండగా మరోకరు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యారు. బంగారం విలువ రూ. 70 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. మంగళవారం బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు.

మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ఎస్పీ అన్నపూర్ణ

వికారాబాద్ : మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ అన్నపూర్ణ చెప్పారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మద్యం దుకాణాల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల బయట మద్యం తాగనివ్వకూడదని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.వరప్రసాద్, డీఎస్పీ స్వామి, ఆర్ఐ క్రాంతికుమార్, ఎక్సైజ్ సీఐలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అన్నపూర్ణ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కొడంగల్ : ఎరువుల విక్రయాలు, నిల్వలు తదితర అంశాలపై జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు దివ్యజ్యోతి, ఏడీ వినయ్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం స్థానిక ఎరువుల దుకాణాల్లో ఎరువుల, మందులు, విత్తనాల విక్రయాల ధరలపై అడిగి తెలుసుకున్నారు. రైతులు పంటలు సాగుచేసేందుకు ఎరువులు, విత్తనాలు, మందులను నాణ్యమైనవి అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మార్పీ ధరకంటే ఎక్కువకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులను విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు బాలాజీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

సర్కారు ఇచ్చిన గొర్రెలు మృతి

దోమ : కేసీఆర్ ప్రభుత్వం యాదవులకు సబ్సిడీపై ఇస్తున్న గొర్రెలు రవాణాలోనే మృతి చెందడంతో గొల్ల కుర్మలకు నష్టం వాటిల్లుతోంది. దోమ గ్రామానికి చెందిన 15 మంది గొల్లకుర్మలకు 15 యూనిట్‌లు గొర్రెలను మంగళవారం పంపిణి చేశారు. పంపిణి చేసిన గొర్రెల లో 4 మృతిచెందాయి. ఒకే లారీలో 4 యూనిట్‌లకు బదులుగా 5 యూనిట్‌ల గొర్రెలు వేయడంతో అనారోగ్యంగా ఉన్న గొర్రెలు మృతి చెందాయని గొర్రెల కాపరులు అంటున్నారు. ఒక యూనిట్‌కు రూ. 31,250 తీసుకుని ప్రభుత్వం రూ.93,750 సబ్సిడీ కలిపి 20 గొర్రెలు, 1 పొట్టేలును ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పంపిణీ చేసిన గొర్రెలలో దోమ గ్రామానికి చెందిన మల్లేష్, వెంకటయ్య, బంక రమేష్, బంక నర్సింహులకు చెందిన మొత్తం 4 గొర్రెలు మృతి చెందాయి. రవాణాలో గొర్రెలు మృతి చెందడంతో నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. మృతి చెందిన గొర్రెల పరిస్థితి ఏమిటని డాక్టర్‌ను గొర్రెల కాపరులు అడగగా ఇన్సూరెన్స్ వస్తుంది ఇస్తామని సమాధానం ఇచ్చారని కాపరులు అంటున్నారు.

మృతి చెందిన గొర్రెలు



5న సీనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక

కులకచర్ల : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ పురుషుల, మహిళల విభాగం ఖో-ఖో జట్ల ఎంపిక సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 5న జరుగుతుందని జిల్లా ఖో-ఖో సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎండీ ఖాజాలు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంపిక జరుగుతుందనీ, ఉమ్మడి జిల్లాకు చెందిన పురుషులు, మహిళలు ఎంపికలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందులో ఎంపికైనవారు ఈ నెల 17 నుంచి 20 వరకు రాష్ట్ర స్థాయిలో జరిగే సీనియర్ ఖో-ఖో పోటీలకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పాల్గొంటారని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు 9000045297, 9948786324 లకు సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

ఇవేమి 'రాజకీయాలు'.!

- పరిగిలో వేడెక్కుతున్న రాజకీయం
- టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు
- విస్తుపోతున్న నియోజకవర్గ ప్రజలు


ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డి

పరిగి : ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, అధికార పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డి మధ్య వార్‌తో రాజకీయం వేడెక్కుతోంది. వీరిమధ్య ఆధిపత్య పోరు కోసం చేసుకుంటున్న విమర్శలపై ప్రజలు చర్చించుకుంటున్నారు. మా పార్టీ, మా ప్రభుత్వం అంటూ టీఆర్ఎస్ నేతలు, మా ఎమ్మెల్యే, మా అధికారమంటూ కాంగ్రెస్ నేతలు ఇలా... ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలు చేసుకోవడంతో నియోజకవర్గ ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు చెవెళ్ల-ప్రాణహిత, పాలమూరు ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డి ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణాస్త్రాలు సంధించుకున్న సంగతి విధితమే. తాజాగా పరిగిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అభివృద్ధి పనులపై నీవేం చేశావు.. నేనేమి చేశానన్న అంశాలపై హాట్ టాపిక్‌గా చర్చ జరుగుతోంది. పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని స్థానిక సంస్థల్లో టీఆర్ఎస్ అధిపత్యం కొనసాగుతుండగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రామ్మోహన్ రెడ్డి కొనసాగుతుండడం వల్ల ఇక్కడి రాజకీయాలు ఆసక్తిని కలిగిస్తున్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వ నిధులు పనులు మీరెలా తీసుకొస్తారని సీనియర్ నేత హరీశ్వర్‌రెడ్డి వాదిస్తుండగా, సమస్యలు మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకొస్తున్నానని ఎమ్మెల్యే టీఆర్ఆర్ చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ హయాంలోని పనులే ఇప్పుడు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే టీఆర్ఆర్ చెప్పుకుంటున్నారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధిపై నీవెంత అంటే నీవెంత స్థాయిలో విమర్శలు గుప్పించుకున్న సంగతి విదితమే. ఇటీవల ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా గిరిజన తండాలకు మంజూరైన నిధులపై ఇద్దరు నేతలు నేనంటే, నేనే తీసుకొచ్చానని పత్రికల్లో ప్రకటించుకున్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను దిండి తరలింపుపై స్పష్టతపై ఇరువురు నేతలు విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు. పత్రికల్లో ఇలా ఉండగా,ఇరువుని నేతల అనచరవర్గం సోషల్ మీడియాలో విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఇటీవల తాను ఏసీడీపీ నిధులతో సీసీ రోడ్డుకు శిలాఫలకం వేస్తే ఓర్వలేకే ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసేవరకు దారితీసింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు గుప్పించుకుంటున్నారు.

ఏదిఏమైనప్పటికీ నియోజకవర్గ అభివృద్ధికి ఈ వాతవరణం మంచిది కాదని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలు ఏమైనా ఉంటే ఎన్నికల సమయంలో ఉండాలి, కానీ అభివృద్ధి విషయంలో ఆరోపణలు, విమర్శలు చేసుకోవడం ప్రగతికి నాందికాదని, మంచివాతారణంలోనే రాజకీయాలు ఉంటేనే మంచిదన్న రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.


పాంబండ దేవాలయంలో నిర్వహించిన కొబ్బరికాయల వేలంపాట

కొబ్బరికాయల వేలం రూ.99 వేలు...

కులకచర్ల : మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ దేవాలయంలో మంగళవారం కొబ్బరికాయల వేలం పాట నిర్వహించారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన రాకొండ బిచ్చయ్య రూ .99 వేలకు కొబ్బరికాయల విక్రయాలను వేలం పాటలో దక్కించుకున్నారు. శ్రావణ మాసం చివరి సోమవారం ఈ నెల 21 సందర్భంగా చిన్న జాతర జరగనుంది. జాతర ఉత్సవాల సందర్భంగా ఈ నెల 14 నుంచి 21 వరకు కొబ్బరికాయలు విక్రయించాలని ఈవో స్నేహలత తెలిపారు. దేవాలయ కమిటీ నిర్ణయించిన ధరకే కొబ్బరికాయలు విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



రేషన్ సరుకుల పంపిణీకి చర్యలు

డిప్యూటీ తహసీల్దార్ గోవిందమ్మ

పరిగి : నిత్యావసర సరుకుల పంపిణీకి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ తహసీల్దార్ గోవిందమ్మ తెలిపారు.

ప్ర : రేషన్‌షాపుల్లో ఈ-పాస్ విధానం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులపై మీరేం చర్యలు తీసుకుంటున్నారు ?

జ : ఈ-పాస్ విధానం వల్ల అక్రమాలకు అవకాశం ఉండదు. అయితే ప్రారంభంలో సాంకేతిక లోపం వల్ల కొన్ని గ్రామాల్లో సమస్యలు వస్తున్నాయి. వృద్ధులకు, వికలాంగుల వేలిముద్రలు తీసుకోని పక్షంలో అక్కడి వీఆర్వో సంతకంతో రేషన్ ఇస్తున్నాం. వచ్చే నెలా నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : మండలంలోని రేషన్‌షాపులెన్ని ? కార్డులెన్ని ? ఎంత కోటా వస్తుంది.?

జ : 45 షాపులు. వీటి పరిధిలో 14,719 ఎఫ్ఎస్‌సీ, 2238 అంత్యోదయ కార్డులు ఉండగా, 78,330యూనిట్లు ఉన్నాయి. వీరికి నెలకు 364 మెట్రిక్ టన్నులు బియ్యం సరఫరా అవుతుంది. కిరోసిన్ అర్బన్‌లో రెండు లీటర్లు, గ్రామా ల్లో ఒక లీటరు సరఫరా చేస్తున్నాం.

ప్ర : ఆన్‌లైన్‌లో నమోదు కానీ, రైతులకు పహాణిలు ఇవ్వడం లేదన్న విమర్శలపై మీ సమాధానం ?

జ : ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో నమోదు కానీ రైతుల కోసం మండల కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్‌ను ఏర్పాటు చేసి రెవెన్యూ రికార్డుల్లో ఎలాంటి తప్పులు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే సరిచేయిస్తున్నాం.

చెరువు శిఖం భూములను సర్వే చేయించాలని వినతి


తహసీల్దార్ శ్రీనివాస్‌శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉమాపతిరెడ్డి, గ్రామస్థులు

కులకచర్ల : మండల పరిధిలోని చౌడాపూర్ గ్రామ పరిధిలోగల చెరువు, కుంటల శిఖం భూముల్లో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమాపతిరెడ్డి మాట్లాడుతూ, గ్రామ పరిధిలోని హన్మయచెరువు, మల్లెకుంట, ఎర్రకుంట, తిమ్మరాసికుంటలను సర్వే చేయించి శిఖంలకు హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కొంత మంది చెరువు, కుంటల శిఖం భూములను కబ్జాలకు పాల్పడుతున్నారనీ, అలాగే వాటి పరిధిలో ఉన్న చెట్లను నరికేస్తున్నారని తెలిపారు. శిఖం భూమిని కొలతలు చేసి రెవెన్యూ రికార్డు ప్రకారం హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే హన్మాయపల్లి హన్‌మాన్ దేవాలయం నుంచి విఠలాపూర్ వరకు గల పానాదు రోడ్డును సర్వే చేయించి కబ్జాకు గురైన వారి నుంచి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువుల శిఖంలను సర్వే చేయించి హద్దుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్‌శంకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కొత్త రంగారెడ్డి, మాసయ్య, కేసయ్య, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను నందనవనంలా తయారుచేయాలి


పాఠశాలలో మొక్క నాటుతున్న హన్మంత్‌రావు

యువజన సర్వీసుల శాఖ జిల్లా అధికారి హన్మంత్‌రావు

పరిగి : పాఠశాలలను నందనవనంలా తయారు చేయాలని యువజన సర్వీసుల శాఖ జిల్లా అధికారి హన్మంత్‌రావు అన్నారు. మంగళవారం పరిగిలో జడ్పీహెచ్ఎస్ నెం.01 పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, జిల్లాలోని అన్ని పాఠశాలల అవరణల్లో మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హరితహారం కార్యక్రమంలో యువజన సంఘాలను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. యువకులు మొక్కలు నాటి పెంచే బాధ్యతను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయప్ప, గ్రామ సర్పంచ్ విజయమాల, పీడీ గాంగ్యా తదితరులు పాల్గొన్నారు.

'తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం'

పరిగి : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఏఎన్ఎం వెంకాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సి.సూర్యకళ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ, పుట్టిన పిల్లలకు వెంటనే తల్లిపాలు తాగించాలన్నారు. దీంతో పిల్లలు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు, బాలింతలకు అందించడం జరుగుతుందని వివరించారు. తల్లిపాలు పిల్లలకు తాగిస్తే పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కరు మొగులమ్మ, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

'పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలి'




మిట్టకోడూరులో పీఆర్‌టీయూ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

పరిగి : సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, పరిగి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇ.విజయ్‌కుమార్, వై.వీరేశంలు డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని మిట్టకోడూరు తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏకీకృత సర్వీసు రూల్స్‌ను వెంటనే అమలు చేసి, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి టి.వెంకటయ్య, జిల్లా బాధ్యులు బుగ్గయ్య, శ్రీధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శ్రీశైలం, శ్రీనివాస్, యాదయ్య, రఘువీర్, మధుకర్‌రెడ్డి, బాలకృష్ణ, నర్సింహారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ఆయా పార్టీల కార్యకర్తలు

పరిగి : మండల పరిధిలోని చిట్యాల్ గ్రామంలో ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాద్‌రావు సమక్షంలో చేరారు. చిట్యాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీఆర్ఎస్ కార్యకర్తలు నాచారం ఆనందం, చింతగళ్ల నర్సింహులు, ఎం.నర్సింహులు, పి.చెన్నయ్య, ఆర్.మల్లేశ్, శ్రీను, సి.యాదయ్య, ఎస్.శ్రీనివాస్, గంగపురి, ఆంజనేయులు, గణేశ్, యాదయ్య తదితర కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ప్రధాని మోదీ చేపడుతున్న పథకాలకు ఆకర్షితులైన బీజేపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బి.రాంచంద్రయ్య, యువ మోర్చ రాష్ట్ర కార్యదర్శి అనీల్‌గౌడ్, మండల అధ్యక్షుడు వేముల పెంటయ్య, నాయకులు జానార్దన్‌రెడ్డి, కె.వెంకటేశ్, శ్రీశైలం, పాండు, రమేశ్, యాదయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


కరణం ప్రహ్లాద్‌రావు సమక్షంలో బీజేపీలో చేరిన కార్యకర్తలు

ఆంధ్రజ్యోతి
5
కొడంగల్
వికారాబాద్, బుధవారం 2 ఆగస్టు 2017
కొడంగల్ ● కొడంగల్‌రూరల్ ● దౌల్తాబాద్ ● బొంరాస్‌పేట్



ప్రభుత్వం అందిస్తున్న ఉచిత దుస్తులను విద్యార్థులకు అందించారు. మంగళవారం కొత్తూర్ పంచాయతీ పరిధిలోని రాంనాయక్ తండాలో పాఠశాల చైర్మెన్ శంకర్‌నాయక్ చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గౌడ్, ఎస్ఎంసీ చైర్మెన్‌లు రాజు, పుల్‌సింగ్, సక్రిబాయి, సుశీల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు. - బొంరాస్‌పేట్

2019 ఎన్నికలే టార్గెట్..

- మంత్రుల పర్యటనతో ప్రతిపక్షాల్లో గుబులు
- టీఆర్ఎస్, టీడీపీల మధ్యే ప్రధాన పోటీ

కొడంగల్‌రూరల్: నియోజకవర్గంలో టీఆర్ఎస్ మంత్రులు తరచూ పర్యటనలు కొనసాగిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. తరచూ మంత్రుల పర్యటనతో ప్రతిపక్ష పార్టీల్లో గుబులు మొదలైందని రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనతో మూడు మండలాలు బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్ వికారాబాద్ జిల్లాలో, కోస్గి, మద్దూర్ మండలాలు మహబూబ్‌నగర్ జిల్లాలోనే కొనసాగుతున్నాయి. ఇంతకు ముందు మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగుతున్న సమయంలో 64 మండలాలు ఉండేవి. ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో 18 మండలాలు మాత్రమే ఉండటంతో అధికారులు, మంత్రులు, కలెక్టర్ తరచూ పర్యటనలు కొనసాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలు, సమావేశాలు నిర్వహించడంతో ఓ పక్క అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పర్యటనతో ప్రతిపక్ష పార్టీల్లో గుబులు రేపుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గొల్ల కురుమ యాదవులకు గొర్రెల పంపిణీ, ఒంటరి మహిళలకు పింఛన్‌లు తదితర పథకాలను నియోజకవర్గంలో ప్రారంభించి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు, రోడ్డు రవాణా శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మెన్ సునితామహేందర్‌రెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డి తదితరులు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సమావేశాలకు హాజరు కావడంతో పాటు మహబూబునగర్ జిల్లాలో విలీనమైన మద్దూర్, కోస్గి మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన సమయంలో కొడంగల్‌లో సమావేశాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. నియోజకవర్గంలో ప్రధానమైన పార్టీలు టీడీపీ, టీఆర్ఎస్ మధ్యనే పోటీ ఉండటంతో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సైతం నియోజకవర్గంలో పర్యటనలను కొనసాగిస్తూ రాజకీయ వేడిని పుట్టిస్తున్నారు.రాబోయే 2019 ఎన్నికలే లక్ష్యంగా ఇటు టీఆర్ఎస్ అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకువెళ్తుండగా, మరో వైపు ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పర్యటనలు కొనసాగిస్తూ రైతు సమస్యలు, ప్రజా సమస్యలపై బహిరంగ సమావేశాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇటీవలే తాండూర్, నారాయణపేట్, కొడంగల్ మండలాల్లో రైతు సమస్యలపై టీడీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు పోరు యాత్ర, ప్రజాగర్జన, మినీ మహానాడు తదితర కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలను నిర్వహిస్తూ ప్రజల్లోకి దూసుకువెళ్తున్నారు. ఈ రెండు పార్టీలకు ధీటుగా నిలదొక్కుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సైతం ప్రజా సమస్యలు, విద్యార్థుల సమస్యలపై పోరాటం కొనసాగిస్తూ నియోజకవర్గంలో పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తుంది. ఏది ఏమైనా రాబోయే ఎన్నికలే లక్ష్యంగా అభివృద్ధి, ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు పోరాటం కొనసాగిస్తున్నాయని చెప్పవచ్చును.





సమావేశంలో పాల్గొన్న ఎంపీ జితేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి(ఫైల్)

సబ్ కలెక్టర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న న్యాయవాదులు

కొడంగల్: సబ్ కలెక్టర్ తీరుతో ప్రజలకు న్యాయం జరగకపోవడంతో పాటు దురుసుగా వ్యవహరిస్తున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.రాములు, సుధాకర్‌రెడ్డి, ఏవీ.ఆనంద్, కరుణాకర్‌రెడ్డి, బస్వరాజ్ తదితరులు ఆరోపించారు. మంగళవారం వారు స్థానిక మున్సిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను సబ్ కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా దృష్టికి తీసుకువెళ్లామన్నా అవకాశం ఇవ్వకుండా అవమానపర్చే విధంగా దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజల పక్షాన న్యాయవాదులు సబ్ కలెక్టర్ దగ్గరికి వెళితే నిల్చుండబెట్టి సమస్యను తెలుసుకోవడం సరి కాదన్నారు. సెక్షన్ 9 సీబీసీ ప్రకారం న్యాయస్థానంలో ఉండే విధంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో చాంబర్ ఉండాల్సినా ఆయన ఒక్కడే కూర్చోని ఫిర్యాదులు అందించే వారిని అవమాన పర్చే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై కొడంగల్ బార్ అసోసియేషన్ తీర్మానంతో సబ్ కలెక్టర్ తీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్, చీఫ్ సెక్రటరి, జిల్లా కలెక్టర్, ఆల్ బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. న్యాయవాది వెంకటయ్యను అవమాన పర్చే విధంగా వ్యవహరించిన సబ్ కలెక్టర్‌పై న్యాయపరంగా పోరాటం చేసేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి కోరనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మురళీనామోజీ, వెంకటయ్యగౌడ్, బీ.వెంకటయ్య, నారాయణగౌడ్, భవనప్ప ఉన్నారు.

'రేషన్ కార్డులు రద్దయిన వారికి బియ్యం అందించాలి'

బొంరాస్‌పేట్: ఈ-పాస్ విధానంలో రేషన్ కార్డులను కోల్పోయిన పేద ప్రజలకు వెంటనే రేషన్ సరుకులను అందించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి నాయకులు చంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ-పాస్ విధానంతో మండలంలోని అన్ని గ్రామాల్లో చాలా మంది రేషన్ కార్డులను కోల్పోవడమే కాకుండా మండలం అంటేనే తెలియని కొందరూ రేషన్ సరుకులను కోల్పోయారు. అలాంటి వారికి అధికారులు పరిశీలన చేసి వెంటనే సరుకులను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రక్తనమూనాల సేకరణ...

బొంరాస్‌పేట్: యువత రక్తనమూనాలపై అవగాహన కలిగి ఉంటూ ప్రమాదాలు, ఆపద సమయంలో రక్తదానానికి ముందుకు రావాలని యంగ్ లీడర్స్ మండల కో ఆర్డినేటర్ నరేందర్‌సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం బాపల్లితండాలో యువతకు రక్త పరీక్షలు నిర్వహించి రక్త గ్రూపులను వివరించారు.

పింఛన్ డబ్బులు ఇవ్వండి సారూ..

బొంరాస్‌పేట్: పింఛన్ డబ్బులను డ్రా చేసుకొని పంచాయతీ కార్యదర్శి ఇవ్వలేదని లింగన్‌పల్లి గ్రామానికి చెందిన పింఛన్‌దారులు ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. మంగళవారం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. లింగన్‌పల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి గ్రామంలోని పింఛన్‌దారుల వేలిముద్రలకు బదులుగా పంచాయతీ కార్యదర్శే వేలి ముద్రలు వేసి గత నెల 18న పింఛన్ డబ్బులు అందించారు. అనంతరం గత నెల 20న జూలై నెలకు సంబంధించిన పింఛన్‌లను వేలి ముద్రలు వేసి డ్రా చేసుకొని నేటి వరకు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీకు వినతి పత్రం అందించారు.

'మొక్కల సంరక్షణతో భావి తరాలకు దోహదం'

కొడంగల్: మొక్కలను నాటడంతో పాటు సంరక్షించేందుకు కృషి చేస్తే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని సర్పంచ్ దామోదర్‌రెడ్డి అన్నారు. హరితహారంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో హరితహారంపై ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాల, గ్రామ పంచాయతీ తదితర ప్రాంతాల్లో గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానురాను అడవులు అంతరించిపోవడంతో ప్రస్తుతం వర్షాలు లేక దుర్భర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటి సంరక్షణకు తోడ్పాటును అందిస్తే వృక్షాలుగా మారి వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండు, బస్వరాజ్, హన్మప్ప, కిష్టప్ప, గోపాల్‌రెడ్డి, ఏపీఓ లింగయ్య, విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రుద్రారంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్

'చిన్నారులకు రుబెల్లా టీకాలు వేయించాలి'



మాట్లాడుతున్న ఎంఈవో వెంకట్రామిరెడ్డి

కొడంగల్‌రూరల్: 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు చిన్నారులకు రుబెల్లా తట్టు టీకాలను వేయించాలని ఎంఈఓ వెంకట్రామ్‌రెడ్డి, వైద్యుడు రవీంద్రయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించి టీకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'పునరావాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి'



గేదెలను అందజేస్తున్న ఎంపీడీవో

కొడంగల్‌రూరల్: సారా విక్రయాలు కొనసాగిస్తూ మానేసిన వారికి ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వీరబ్రహ్మచారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పర్‌పల్లి తండాకు చెందిన రుమ్యా నాయక్ సారా తయారు చేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో ప్రభుత్వం పునరావాసం కల్పించడంతో రూ.2లక్షల విలువ గల గేదెలను అందించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఉన్నారు.

రేపు మండల స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

కొడంగల్: ఈ నెల 3న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 14 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల్లోపు బాల బాలికలకు మండల స్థాయి వాలీబాల్ సెలక్షన్‌ను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కార్య నిర్వహణ అధికారి రమేశ్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు సెలక్షన్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9440160104 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు వికలాంగులకు బస్‌పాస్‌ల కోసం పరిశీలన

కొడంగల్‌రూరల్: మండలంలో వికలత్వం ఉన్న వికలాంగులు ఉచిత బస్‌పాస్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని వికలాంగ సమాఖ్య సీసీ మోనమ్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బస్ పాస్‌ల కోసం దరఖాస్తు చేసుకునే వారు సదరమ్ సర్టిఫికేట్, రెండు ఫోటోలతో బుధవారం మహిళా సమాఖ్య కార్యాలయానికి రావాలని కోరారు. అర్హులైన వారికి పరిగి ఆర్టీసీ డిపో అధికారులు బస్‌పాస్‌లను అందించనున్నట్లు వివరించారు.

లేఅవుట్ భూములను పరిశీలించిన ఆర్డీవో



మోమిన్‌పేట: మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన లేఅవుట్ భూములను మంగళవారం ఆర్డీవో విశ్వనాథం పరిశీలించారు. ఆర్అండ్‌బీ రోడ్డు ఏర్పాటుకు అవసరమైన భూములను ఆర్డీవో పరిశీలించారు. లేఅవుట్, ఆర్అండ్‌బీ రోడ్డు వేయడానికి ఏయే సర్వే నెంబర్లలో భూములు ఉన్నాయని అధికారుల ద్వారా ఆరా తీసారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ షహదబేగం, ఆర్ఐ రమేష్, సర్వేయర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు ప్రాణాధారం

● సీడీపీవో మల్లీశ్వరి

వికారాబాద్ అర్బన్: ప్రతి బిడ్డకు తల్లిపాలు అందించాలని తల్లిపాలతో పిల్లలకు ఎలాంటి వ్యాధులు ధరిచేరవని సీడీపీవో మల్లీశ్వరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ద్యాచారం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. తల్లిపాలు నీళ్ల విరోచనాలను, శ్వాస కోశ వ్యాధులను స్థిరంగా తగ్గించడం, శిశు ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, వారి మరణాల రేటును గణనీయంగా తగ్గించడానికి సహయపడుతాయన్నారు. ఐదు సంవత్సరాలోపు పిల్లలకు తల్లి పాలే ప్రాణధారమన్నారు. తల్లిపాలు పేద, ధనిక బేధభావలు లేకుండా పిల్లలందరికి ఐక్యూ (తెలివి తేటలు) పెంచుటకు దోహదపడుతుందన్నారు. వారం పాటు జరిగే తల్లిపాల వారోత్సవాల్లో ప్రతి మహిళకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అదే విధంగా పిల్లలకు వచ్చే తట్టు, అమ్మతల్లి వంటి వ్యాధులకు రుబెల్లా అనే టీకాను ప్రభుత్వం వేస్తున్నట్టు గ్రామస్తులకు సూచించారు. 9 నెలల పిల్లవాడి నుంచి 15 సంవత్సరాల పిల్లల వరకు అందరికి టీకాలను వేయించాలని సూచించారు. గ్రామాల్లో మూడు సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడీలు బాధ్యతయుతంగా ఈ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ పాండు, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు అధికారి జ్యోత్స్న

ధారూరులో..

ధారూరు: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లులు తప్పనిసరిగా ముర్రిపాలను తాగించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి జ్యోత్స్న తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముర్రుపాలలో పోషకాలు అధికంగా ఉంటాయని వీటిని తాగించడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. తల్లులు చేతులను పరిశుభ్రంగా కడుక్కొని బిడ్డలకు పాలు ఇవ్వాలని, ఇచ్చే పాలను నిదానంగా పిల్లలకు పట్టాలని ఆమె సూచించారు. గర్భిణీలు సకాలంలో టీకాలను తీసుకుని పౌష్టికాహారం భుజించాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇందిరా, సుశీల, ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరి, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



బాలమృతం అందజేస్తున్న సీడీపీవో మల్లీశ్వరి

'హారిక మృతిపై సమగ్ర విచారణ జరపాలి'

వికారాబాద్ అర్బన్: మర్పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థిని హారిక మృతిపై నెలకొన్న పలు అనుమానాలు నివృత్తి కావడానికి సమగ్ర విచారణ జరిపించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్‌పీఎఫ్) బాధ్యులు ఎస్పీ అన్నపూర్ణకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎస్పీని కలిసి హరిక మృతిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం అందించేలా చూడాలన్నారు. ఎస్పీని కలిసిన వారిలో సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధనసిరి ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి నర్సిములు, జనార్ధన్, వెంకటయ్య, నర్సిములు, రాంచంద్రయ్య, పుల్లయ్య, ఆశలత తదితరులు పాల్గొన్నారు.

'హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలి'

మోమిన్‌పేట: మండల పరిధిలోని చక్రంపల్లి గ్రామంలో మంగళవారం పలువురు పోలీసులు మొక్కలు నాటి నీళ్లు పోసారు. ఈ సందర్భంగా సర్పంచ్ శశికళ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హరితహారంలో పాల్గొని మొక్కలు నాటి సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఏలు నాగరాజు, పలువురు పోలీసులు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న మాజిద్

నవాబుపేటలో..

నవాబుపేట: మండల పరిధిలోని పూలపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన నారెగూడలో కెనరా బ్యాంకు ఎదుట డీపీవో మాజిద్ మంగళవారం మొక్కలు నాటారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి అనిత, సర్పంచ్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షీ-టీమ్‌పై విద్యార్థులకు అవగాహన

● జిల్లా ఇన్‌చార్జి నిర్మల

వికారాబాద్ అర్బన్: ప్రతి మనిషికి పుట్టుక, చావు రెండు ఉంటాయని కాని పుట్టుకకు ఒక అర్థం ఉండేలా ప్రతి మనిషి జీవించాలని జిల్లా షీటీమ్స్ జిల్లా ఇన్‌చార్జి, వికారాబాద్ మహిళా సీఐ నిర్మల అన్నారు. మంగళవారం స్థానిక శ్రీమేధ జూనియర్ కళాశాలలో షీటీమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం ఆనాటి నుంచి నేటి వరకు రక్షణ కల్పించాల్సి వస్తుందన్నారు. ద్వాపర యుగంలో కృష్ణుడు, ఇప్పుడు పోలీసులు మహిళలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. కాని మహిళలకు ఎప్పుడు వారిపై వారికి నమ్మకం వస్తుందని ప్రశ్నించారు. ఒక ఆడపిల్లకు ఇబ్బంది ఎదురయితే అందరూ ఆడపిల్లలు కలిసి సమస్యను ఎదుర్కోవాలని సూచించారు. ప్రపంచ ఆవిర్భావం నుంచి మొన్న జరిగిన తెలంగాణ ఉద్యమం వరకు అన్ని ఉద్యమాల్లో స్త్రీ పాత్ర ఎంతో ఉందని, కాని ఇప్పటికి స్త్రీకి రక్షణ లేకుండా పోతున్నదన్నారు. మనం చేసే పనిలో అమ్మానాన్నలను ఒకసారి ఆలోచించుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలో షీటీమ్ బృందం పని చేస్తుందని, ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఉన్నాయని, అలాగే మఫ్టీలో షీటీమ్ బృందాలు ఉంటాయని తప్పు చేసిన వారు ఎవరైనా విడిచి పెట్టేది లేదన్నారు. ధృడ సంకల్పంతో లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దారి వైపు ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషోర్‌శర్మ, అధ్యాపకులు నర్సిములు, మహిళా కానిస్టేబుల్ రాశేశ్వరి, పోలీస్ కళాజాత బృందం, షీటీమ్ సభ్యులు ఉన్నారు.



మాట్లాడుతున్న నిర్మల

నాబార్డు ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

నవాబుపేట: తక్కువ నీటితో పండించే పంటలనే వేయాలని కేశవపల్లి వాటర్‌షెడ్ ఛైర్మన్ కందాడ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం కేశవపల్లి లో నాబార్డు స్వచ్ఛంద సంస్థ వారి సౌజన్యంతో రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం నీరు, అడవులు, బోరుబావులు పశువులు ఏవిధంగా ఉన్నాయో ప్రస్తుతం దానికి విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఫ్రెండ్ అనాలసిస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రాప్ వాటర్ బడ్జెట్‌పై ప్రతి రైతుకు అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో నాగబ్రహ్మాచారి, వాటర్‌షెడ్ ఛైర్మన్ అంజయ్య కార్యదర్శి వెంకటయ్య, వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి తదిరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 90 దరఖాస్తులు

కోట్‌పల్లి(బంట్వారం): మండలంలోని మోత్కుపల్లి గ్రామంలో మంగళవారం తహసీల్దార్ బుచ్చయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 90 దరఖాస్తులు వచ్చాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేషం, ఆర్ఐ శ్రీపాల్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు నేరుగా ఉపాధి కూలీల ఖాతాల్లో జమ

ధారూరు: ఉపాధి హామి కూలీలకు కేంద్ర ప్రభుత్వమే నేరుగా కూలీ డబ్బులను జమ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఉపాధి హామి కూలీల కూలీ డబ్బులను చెల్లించడంలో జాప్యాన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. 2018 జనవరి 1 నుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి కూలీల ఖాతాల్లో డబ్బులను జమ చేసేందుకు గ్రామాల్లో మంగళవారం నుంచి ఉపాధిహామి, బ్యాంకు అధికారులు కలిసి కూలీల ఆధార్‌కార్డులను, బ్యాంకు ఖాతా నెంబర్లను సేకరించేందుకు ప్రత్యేక శిబిరాలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఉపాధి హామి కూలీలకు వారి ఖాతాల ద్వారా డబ్బులు చెల్లిస్తుండగా వచ్చే ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వమే ప్రత్యక్షంగా కూలీ డబ్బులను కూలీలకు వారి ఖాతాల్లో జమ చేయనుంది. ధారూరు మండల పరిధిలోని అల్లీపూర్, చింతకుంట, అంతారం, ధారూరు స్టేషన్ గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామి అధికారులు, సిబ్బంది బ్యాంకు అధికారులు ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు.

'విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి'



పార్టీ సభ్యత్వంను అందజేస్తున్న ఎమ్మెల్యే

వికారాబాద్ అర్బన్: విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బి. సంజీవరావు అన్నారు. మంగళవారం సిద్దార్థ జూనియర్ కళాశాలలో నిర్వహించిన టీఆర్ఎస్‌వీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టీఆర్ఎస్‌వీ నిరంతరం విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంచంద్రారెడ్డి, డైరెక్టర్ గోపాల్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి శుభప్రద్‌పటేల్, సర్పంచ్ పాండు, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, టీఆర్ఎస్‌వీ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని ధర్నా

బంట్వారం: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దరఖాస్తు చేసుకున్న ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులతో పాటు ప్రభుత్వ రుణాలు, అన్ని రకాల సబ్సిడీలు వారికి వర్తింపజేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, జనార్దన్, రాములు, రవి పాల్గొన్నారు.

వృథాగా టేకుమొక్కలు



నాటకుండా వదిలేసిన టేకు మొక్కలు

ధారూరు: మండలంలోని కొండాపూర్ కలాన్‌లో పొలాల్లో టేకు మొక్కలను నాటకుండానే వదిలేసారు. రైతుల పొలాల వద్ద టేకు మొక్కలు నాటడానికి ఉపాధి కూలీలతో గుంతలు తవ్వించారు. గుంతల్లో టేకుమొక్కలను నాటకుండా వదిలేసారు. ఉపాధి హామి సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

'ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి'

అనంతగిరి: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండి సన్మార్గంలో నడవాలని మానవ్‌ముతాన్ ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధి ముక్తాబాయి అన్నారు. మంగళవారం అనంతగిరిలో అనంతపద్మనాభ స్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, భగవంతుని సేవ చేయడం ద్వారానే ముక్తి పొందుతారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అపరిచిత్ బాయి, మార్వాడి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పట్టణ పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన భక్తులు అనంతగిరిలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుష్కరిణి వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



పులుమద్దిలో పర్యటిస్తున్న జాన్సన్

'హరితహారం' మొక్కలను రక్షించాలి

● జియో ట్యాగింగ్ వేగవంతం చేయాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి జాన్సన్

వికారాబాద్ అర్బన్ : హరితహారం మొక్కలను ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా రక్షించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి జాన్సన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పులుమద్ది గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న మొక్కలను పరిశీలించారు. అక్కడ నాటిన మొక్కలను జియోట్యాగింగ్ చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాలంలో మొక్కలను అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. జియో ట్యాగింగ్ ఏ విధంగా చేస్తున్నారనే వివరాల గురించి ఆయన ఈజీఎస్ ఈసీ జ్యోతి, టీఏ జంగయ్య, ఏపీవో సుధాకర్‌లను ప్రశ్నించారు. నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం, గ్రామంలో ఇంటింటికి తిరిగి ఇళ్ల ముందు నాటిన మొక్కలను పరిశీలించారు. అదే విధంగా అక్కడ తయారు చేసిన విత్తన బంతులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వేణుగోపాల్, ఎంపీడీవో సత్తయ్య, సర్పంచ్ శ్వేత, ఎంపీటీసీ వెంకటయ్య, ఏపీవో సుధాకర్, ఏపీఎం లక్ష్మయ్య, సాక్షర భారత్ కోఆర్డినేటర్లు రమేష్, సుమిత్ర, గ్రామస్తులు శివయ్య, భుజంగం, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలకు ప్రత్యేక శిబిరం

బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జాన్సన్ అన్నారు. మంగళవారం మదన్‌పల్లిలో బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధాన ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పంట రుణాలకు సంబంధించిన బ్యాంకు ఖాతా కాకుండా మరో బ్యాంకు ఖాతాను తెరుచుకోవాలని, ఆ ఖాతాను ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. రైతులుపంటల కోసం తీసుకున్న రుణాల బకాయిల కింద బ్యాంకర్లు ఉపాధి కూలీ డబ్బులు మినహాయించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బ్యాంకు అధికారులు రైతుల కూలీ డబ్బులను అప్పు కిందకు జమ చేసుకోవద్దని అక్కడే ఉన్న ఫీల్డ్ అఫీసర్‌కు ఆయన సూచించారు. రైతుల పంట రుణాల డబ్బులు ఉంటే పంటలు చేతికొచ్చే సమయానికి వెళ్లి తెచ్చుకోవాలని అన్నారు. రైతులు పంట రుణ ఖాతా కాకుండా పొదుపు ఖాతాను తప్పకుండా తెరిచి ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మణెమ్మ, ఎంపీడీవో సత్తయ్య, ఏపీవో సుధాకర్, ఏపీఎం, ఫీల్డ్ అసిస్టెంట్ రాంచంద్రయ్య పాల్గొన్నారు.

మర్పల్లి కేజీబీవీకి తాళం..

సహచర విద్యార్థిని మృతితో ఇళ్లకు వెళ్లిన విద్యార్థినులు

మర్పల్లి : మర్పల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి తాళం పడింది. ఈ విద్యాలయంలో తొమ్మిదోతరగతి చదువుతున్న విద్యార్థిని హారిక ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో అక్కడ చదువుతున్న మిగతా విద్యార్థులు భయాందోళనకు గురై ఇంటి ముఖం పట్టారు. విద్యార్థినులు అందరూ తమ ఇళ్లకు వెళ్లడంతో కస్తూర్బా విద్యాలయానికి తాళం పడింది. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులు 200 మంది ఉన్నారు. తమ సహచర విద్యార్థిని విద్యాలయం ఆవరణలోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మిగతా విద్యార్థినులు ఎంతగానో మనోవేదనకు గురయ్యారు. నిత్యం తమతో కలిసి ఉండే హారిక ఆత్మహత్య చేసుకోవడంతో తాను మృతి చెందిన కళ్ల ముందే మెదలడంతో విద్యార్థినులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సోమవారం పోలీసుల హడావిడి, నాయకులు ధర్నాలు, అధికారుల ప్రశ్నలతో విద్యార్థినులు మరింత ఆందోళనకు గురయ్యారు. దీంతో విద్యార్థినులు తమ కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి తమను ఇళ్లకు తీసుకు వెళ్లాలంటూ కంటతడి పెట్టారు. జరిగిన సంఘటన తెలుసుకున్న తల్లిదండ్రులు విద్యాలయానికి వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకు వెళ్లారు. మంగళవారం మిగతావారు ఇళ్లకు వెళ్లిపోవడంతో కేజీబీవీకి తాళం పడింది. పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో ఉపాధ్యాయులు పాఠశాలలో ఉండి ఇంటిముఖం పట్టారు.

కూలీల ఖాతాలకు 'ఆధార్'

ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు అనుసంధానం

కూలి డబ్బులు బ్యాంకుల్లోనే..

ఖాతా లేని కూలీలకు

కొత్త ఎకౌంట్ తెరిపించేలా చర్యలు

సెప్టెంబర్ 10లోగా పూర్తి చేసేలా కార్యాచరణ

గ్రామాల వారీగా అవగాహనా శిబిరాలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో 1,84,919 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, 4,29,916 మంది కూలీ పనులు చేస్తున్నారు. వీరిలో శ్రమశక్తి సంఘాల్లో 3,15,433 మంది కూలీలు నమోదయ్యారు. ఉపాధి హామీ కూలీల్లో ఇంత వరకు 2,68,037 మంది కూలీలు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోగా, 47,316 మంది కూలీలు ఇంకా తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంది. ఇదిలా ఉంటే, కూలీల్లో ఇప్పటి వరకు 2,29,631 మంది కూలీలు తమబ్యాంకు ఖాతాల వివరాలను తమ జాబ్ కార్డులో నమోదే చేసుకోగా, ఇంకా 85,802 మంది కూలీలు తమ బ్యాంకు ఖాతాల వివరాలు అందజేయాల్సి ఉంది. బ్యాంకు ఖాతా లేని ఉపాధి కూలీలతో కొత్తగా బ్యాంకు ఖాతా తెరిపించి ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు కూలీలకు ఉన్న బ్యాంకు ఖాతాల్లో ఒక ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసేందుకు మంగళవారం నుంచిజిల్లాలో ప్రత్యేక శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఒక్కో కూలీ పేరిట రెండు నుంచి నాలుగు వరకు వివిధ బ్యాంకుల ఖాతాలు ఉన్నాయి. ఒకటికంటే ఎక్కువ ఉన్న బ్యాంకు ఖాతాల్లో ఏదైనా ఎంపిక చేసుకున్న బ్యాంకు ఖాతాకు వారి ఆధార్ సంఖ్యను అనుసంధానించనున్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చెల్లింపులన్నీ ఎంపిక చేసుకున్న బ్యాంకు ఖాతాలోనే జమకానున్నాయి. ఆధార్‌తో అనుసంధానం చేయని బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలను నిలిపివేయాలని తీసుకున్న నిర్ణయం మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయని బ్యాంకు ఖాతాలు కలిగిన కూలీలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి కూలీలకు అవగాహన కల్పించనున్నారు. ఈ శిబిరాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు హాజరుకానున్నారు. ఈ ప్రక్రియ వచ్చేనెల 10వ తేదీ వరకు ముగించాలని గడువు విధించారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఉపాధి పనులు చేసే కూలీల వేతనం బ్యాంకుల్లోనే జమ చేయనున్నారు. పోస్టాఫీసుల ద్వారా చెలిస్తున్న ఉపాధి కూలీ డబ్బుల చెల్లింపులను ఇక నిలిపివేయనున్నారు. మండలాల పరిధిలోని గ్రామాల్లో ఏయే రోజుల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారనేది ఇప్పటికే ప్రకటించారు. ఒక్కో గ్రామంలో నాలుగు రోజుల పాటు శిబిరం నిర్వహించనున్నారు. శిబిరానికి సంబంధిత అధికారులు హాజరై కూలీల బ్యాంకు ఖాతాలకు వారి ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయనున్నారు.



ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలంటే..

ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ తన బ్యాంకు ఖాతాకు ఆధార్‌తో అనుసంధారం చేసుకోవాలి. గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో కూలీలకు బ్యాంకు ఖాతాకు, ఆధార్ అనుసంధానం చేసుకునే విషయమై అవగాహన కల్పిస్తారు. తమ బ్యాంకు ఖాతాకు, ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయాలని కోరుతూ కూలీల నుంచి అంగీకార పత్రం తీసుకుంటారు. బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డుతో అనుసంధానం చేసేందుకు కూలీలు తప్పనిసరిగా తమ బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు జిరాక్స్ ప్రతులను అంగీకారపత్రానికి జతపరిచి అందజేయాల్సి ఉంటుంది. కూలీ తన మొబైల్ ఫోన్ నెంబర్ నమోదు చేయాలి. అవగాహన శిబిరాలకు ఆ గ్రామాల సర్వీసు బ్యాంకులు, ఈజీఎస్ అధికారులు హాజరై బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసేందుకు అవసరమైన పత్రాలను కూలీల నుంచి స్వీకరిస్తారు. ఆధార్ సీడింగ్ చేసిన కూలీల వివరాలను వెబ్‌సైట్‌లో గ్రామ పంచాయతీల వారీగా నమోదు చేస్తారు. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతా లేని కూలీలకు బ్యాంకు ఖాతా తెరిపించి ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. ఒక కూలీకి ఒక బ్యాంకు ఖాతా కంటే ఎక్కువ ఖాతాలు ఉంటే కూలీ ఎంపిక చేసుకున్న బ్యాంకు ఖాతాను ఉపాధి హామీ ఖాతాగా గుర్తించి ఆ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేస్తారు. .

అనుసంధానం చేసుకోవాలి

ఉపాధి హామీ కూలీలు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసుకోవాలి. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోని కూలీలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాం. నగదు చెల్లింపులు కాకుండా జనవరి నెల నుంచి ఉపాధి కూలీల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తారు.

- పీడబ్ల్యూ జాన్సన్,
జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

రెండు బస్సులు, కారు ఢీ

● ఇద్దరికి తీవ్ర, ముగ్గురికి స్వల్ప గాయాలు

● తప్పిన పెను ప్రమాదం

● సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ అన్నపూర్ణ

● ఆసుపత్రిని సందర్శించిన మాజీ మంత్రి

వికారాబాద్ అర్బన్ : రెండు బస్సులు, ఒక కారు ఢీ కొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని భృంగీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సు (ఏపీ28టీబీ 5015) పాఠశాల విడిచిన తరువాత విద్యార్థులను ఇళ్ల వద్ద వదిలేందుకు బయలు దేరింది. వికారాబాద్ ఎన్నెపల్లి సమీపంలో వేగంగా వచ్చిన స్కూల్ బస్సు అదుపు తప్పి పరిగి నుంచి వస్తున్న కారును ఢీకొడుతూ అదే సమయంలో హైదరాబాద్ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు (ఏపీ29జెడ్2597)ను ఢీ కొట్టింది. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో రెండు బస్సులు ముందుకు దూసుకెళ్లి ముందు వెళుతున్న కారును ఢీ కొట్టాయి. ఈ ప్రమాదంలో స్కూల్ బస్సు డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలు కాగా, స్కూల్ బస్సులో ముందు వరుసలో కూర్చున్న 3వ తరగతి చదువుతున్న అనియాబేగం (గరీబ్‌నగర్ కాలనీ) బస్సు అద్దాల్లో నుంచి ముందుకు పడిపోయింది. ఈ ప్రమాదంలో అనియాబేగంకు తీవ్ర గాయాలయ్యాయి. అదే బస్సులో ముందు కూర్చున్న ఆసిఫియా (5వ తరగతి), కార్తీక్ (5వ తరగతి), సామేదా (4వ తరగతి)లకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సులో ఎవరికీ గాయాలు కాలేదు.

సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ అన్నపూర్ణ

ప్రమాదం జరిగిన సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ అన్నపూర్ణ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి దారితీసిన వివరాల గురించి అక్కడున్న ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీఆసుపత్రికి చేరుకుని గాయపడ్డ వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ విద్యార్థినులను ఎస్పీ ఓదార్చారు. మెరుగైన చికిత్స అందించేందుకు హైదరాబాద్‌కు తరలించాలంటూ ఆమె డీఎస్పీ టి.స్వామి, ధారూరు సీఐ ఉపేందర్‌లను ఆదేశించారు.

మిన్నంటిన రోదనలు

రెండు బస్సులు, కారు ఒక దానికొకటి ఢీ కొట్టడంతో ఎన్నేపల్లి ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రమాద సంఘటన దృశ్యాలు, బస్సులు, కారు ధ్వంసమైన తీరు చూస్తే మాత్రం పెను ప్రమాదమే చోటు చేసుకున్నట్లుగా భయానకంగా కనిపించింది. ఎన్నేపల్లిలో బస్సులు ఢీకొన్న విషయం ఆ నోట ఈ నోట పట్టణమంతా వ్యాపించడంతో ప్రజలు పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అక్కడికి రోదిస్తూ చేరుకున్నారు. పిల్లల రోదనలతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంగా మారింది. విద్యార్థులు, తల్లిదండ్రుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఇరువైపులా అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడం, అధిక సంఖ్యలో ప్రజలు చేరుకోవడంతో నియంత్రించడం పోలీసులకు సాధ్యం కాలేదు. సుమారు గంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటన స్థలం నుంచి అందరినీ పంపించేసరికి పోలీసుల తలప్రాణం తోకకు వచ్చినట్లయింది. ఎస్ఐ సురేష్ దగ్గరుండి వాహనాలను అక్కడి నుంచి తరలించారు.



ఘటన స్థలంలో గుమిగూడిన ప్రజలు, అంబులెన్స్‌లో గాయపడిన విద్యార్థులు

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన మాజీ మంత్రి

తమ పాఠశాల బస్సుకు ప్రమాదం జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న భృంగీ విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి చంద్రశేఖర్ హుటాహుటిన సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. అనంతరం ఏరియా ఆసుపత్రికి చేరుకుని అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థులు, డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ..

12 తులాల బంగారు ఆభరణాలు...

రూ.50 వేల నగదు... ఇతర వస్తువుల అపహరణ

వికారాబాద్ : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి సుమారు ఐదు లక్షల విలువ కలిగిన బంగారు ఆభరణాలు, ఇతర విలువైన సామగ్రి, నగదును దొంగిలించారు. ఈ సంఘటన సోమవారం రాత్రి వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. ఆరో వార్డు పరిధిలో రవికుమార్ ఉపాధ్యాయుడు నివాసం ఉంటున్నాడు. సోమవారం మధుకాలనీలో తన సోదరుడి గృహ ప్రవేశం ఉండడంతో కుటుంబసభ్యులందరితో కలిసి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దొంగలు తాళం విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, ఇతర విలువైన వస్తువులను దొంగలు దొంగిలించారు. ఉదయం ఇంటికి వచ్చి చూసిన రవికుమార్ కుటుంబ సభ్యులు జరిగిన దొంగతనాన్ని గుర్తించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటడం

సామాజిక బాధ్యత..

-టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు హరీశ్వర్‌రెడ్డి

పరిగి: మానవమనుగడకు మొక్కల పెంపకం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు కె.హరీశ్వర్‌రెడ్డి అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని సయ్యద్‌పల్లి గ్రామంలో ఆయన మొక్కలు నాటారు. పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డించారు. శ్రీమల్లికార్జున దేవాలయం, దర్గాలోపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్‌లో మానవ మనగడకు ముప్పును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అడవులు అంతరించడంతోనే వర్షాలు కురువకపోవడం, వర్షంతో రైతులకు నష్టం వాటిల్లడమే కాకుండా ప్రతి ప్రాణికోటికి, దేశ ఆర్థిక వ్యవస్థ కూడా నష్టం వాటిల్లుతుందనిపేర్కొన్నారు. అడవులను నరికివేసి వాటికి పండ్లు ఫలాలు లభించకపోవడంతోనే కోతులు జనారణ్యంలోకి వచ్చి అనేక విధ్వాంసాలు సృష్టిస్తున్నాయన్నారు. ప్రతి పాఠశాలలో ప్రతి ఇంటి దగ్గర, ప్రభుత్వ స్థలాల్లో ప్రతి ఒక్కరు మొక్కలు నాటిపర్యావరణాన్ని కాపాడల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. చెట్లు లేకపోతే మానవ మనగడనే లేదన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఒక్క మొక్కనైనా నాటి పెంచి పోషించాలని సూచించారు. విద్యార్థులు పాఠశాల అవరణలో, ఇంటి పెరట్లో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. మొక్కల పెంపకం భారీగా చేపడితే వర్షాలుపుష్కలంగా కురిసే అవకాశాలు ఉంటాయని, వాతావరణంలో వస్తున్నమార్పులన్నింటికి ఆడవులు లేకపోవడమేననే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటి చైర్మెన్ ఆర్.ఆంజనేయులు, పిఏసిఎస్ చైర్మెన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఎస్.భాస్కర్; గ్రామ సర్పంచ్ లింగమ్మ,. ఎంపీటీసీ భీమమ్మ, పి.వెంకటయ్య, బి.రవికుమార్, ఆశోక్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

‘25వేల నవీన క్షౌర శాలల ఏర్పాటు’



మాట్లాడుతున్న పాల్వాయి శ్రీనివాస్

ఆమనగల్లు : రాష్ట్రంలో 25వేల నవీన క్షౌరశాలల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్వాయి శ్రీనివాస్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటనర్సింహ్మా గార్డెన్‌లో మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రచార కార్యదర్శి కానుగుల దశరథం అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సిద్దులు ,ఉపాధ్యాక్షులు మల్లారి రమేశ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ నిర్ణయం మేరకు నవీన క్షౌర శాలల ఏర్పాటుకు సంబంధించి ఈనెల 8న మంత్రులు ఈటెల రాజేందర్, జోగు రామన్నల ఆధ్యక్షతన సమావేశం నిర్వహించి విదివిధానాలను ఖరారు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి యాదయ్య, మండల అధ్యక్షుడు పెరికేటి యాదయ్య, ఉపాధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి దేవర కొండ రమేశ్, నాయకులు గణేశ్, తానయ్య, పెద్దయ్య , రమేశ్, యాదగిరి, మూర్తి , రాంచంద్రయ్య, నర్సింహ్మా , బాలు, సైదులు , యాదయ్య, బిక్షపతి, పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద దాడికి పాల్పడిన నిందితుల అరెస్ట్

- నిందితులకు 14 రోజల రిమాండ్
- అధికార పార్టీ నేత కుమారుడు, స్నేహితుల వీరంగం
- రూ.30 టోల్ ఫీజు చెల్లింపుపై ఘర్షణ
- కారు ఆపినందుకు సిబ్బందిపై దాడి
- సూపర్‌వైజర్‌ని వెంటాడి కత్తితో పొడిచిన వైనం
- నిందితులను కేసు నుంచి తప్పించే యత్నం

ఆమనగల్లు / కడ్తాల్ : అధికార పార్టీ నేత కుమారుడు, అతని స్నేహితులు తప్పతాగి కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద వీరంగం సృష్టించిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్‌చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కల్వకుర్తి మున్సిఫ్‌కోర్టు ఆరుగురికి 14రోజుల పాటు రిమాండ్ విధించింది. సోమవారం రాత్రి అధికార పార్టీ నాయకుడి కుమారుడు కడ్తాల్ వద్ద టోల్ ఫీజు కట్టకుండా వెళుతున్న వాహనాన్ని ఆపినందుకు స్నేహితులతో కలిసి సిబ్బందిపై కత్తి తీసి దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడిలో సూపర్ వైజర్ గాయాలతో బయటపడ్డాడు. ఆ తర్వాత ఆ యువకులు కారులో పారిపోతుండగా టోల్‌సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కడ్తాల్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తమ సిబ్బందితో మాటు వేసి వారిని పట్టుకున్నారు. ఇదిలా ఉండగా టోల్‌ప్లాజా సూపర్ వైజర్ మహేశ్‌ది కడ్తాల స్వస్థలం కావడంతో దాడి వార్త తెలియగానే స్థానికులు ,కుటుంబీకులు , స్నేహితులు, వివిధ పార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. వాస్తవానికి ఈ ఘర్షణ అంతా రూ. 30ల టోల్ ఫీజు చెల్లించే విషయంలో జరగడం గమనార్హం.



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

కేసు తప్పించేయత్నం

ఈ సంఘటనపైస్టేషన్ వద్ద అర్థరాత్రి వరకు హైడ్రామా నెలకొంది. ఎల్‌బిఎనగర్ టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి ముద్దగోని రామ్మోహన్ గౌడ్ కుమారుడు ఉండటంతో కేసు నుంచి తప్పించేందుకు కొందరు నాయకులు యత్నించారు. మహేశ్‌ను ఫిర్యాదు తిరిగి తీసుకోవడానికి పెద్ద ఎత్తున బేరసారాలు కూడ సాగినట్లు సమాచారం. కేసు నమోదులో కూడా ఆలస్యం చేశారు. రామ్మోహన్ గౌడ్ కూడ అర్థరాత్రి కడ్తాలలోని మహేశ్ఇంటికి చేరుకొని జరిగింది పొరపాటే అని అతనికి నచ్చజెప్పె ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయినట్లు తెలిసింది. అయితే ఈ విషయం తెలిసిన పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవడంతో వెంటనే కేసు నమోదు చేశారు.

దాడికి పాల్పడిన ఆరుగురి అరెస్ట్...

టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ మహేశ్‌పై దాడికిసంబందించి ఆరుమంది యువకులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. సోమవారం జరిగిన దాడికి సంబందించి బొప్పిడి అరుణ్ కుమార్ రెడ్డి, కేత నిశిత్ , తాళ్లపల్లి సాయితేజరెడ్డి, ముద్దగోని మనీష్ గౌడ్, సామ సాయి కుమార్, మారుపాకుల అనిరుధ్ గౌడ్‌ల పై మహేశ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదే రాత్రి వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులపై ఐపీఎస్ 148, 307,506ఆర్/ డబ్ల్యూ కింద కేసు నమోదు చేశారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

సూపర్‌వైజర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ఈ ఘటనలో గాయపడిన టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ గాయపడంతో విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి మంగళవారం కడ్తాల్‌లోని ఇంటికి వెళ్లి మహేశ్‌ను పరామర్శించారు. దాడికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స కోసం మహేశ్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి తెలిపారు.

వంట.. మంట

- వంట గ్యాస్‌కు మంగళం..
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పెనుభారం
- ప్రతి నెలా రూ.4కు పెంచుతూ చివరకు స్వస్తి
- వంట గ్యాస్ మంటగా మారుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : వంట గ్యాస్ సిలిలండర్‌పై సబ్సీడీని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్దం చేసింది. ఆ భారాన్ని ప్రజలపై రుద్దేందుకు నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం సబ్సిడీని ఎత్తివేసేందుకు సిలిండర్‌పై నెలా రూ.4 పెంచాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్‌పై రాయితీని ఎత్తివేసేందుకు నిర్ణయం తీసుకోవటంపై పేద మధ్యతరగతిపై మోయలేని భారం పడనుంది. ఒకేసారి కాకుండా ప్రతి నెలా ధర పెంచుతూ.. కొన్నాళ్లలో రాయితీకి మంగళం పలికేందుకు చూస్తుంది. వంట గ్యాస్ సబ్సిడీ ఎత్తివసేందుకు కేంద్ర తీసుకున్న నిర్ణయంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్‌పై రాయితీ ఎత్తివేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 41 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ సంస్థలు ప్రతి నెలా వినియోగ దారులకు గ్యాస్‌ను సరఫరా చేస్తుంది. జిల్లాలో మొత్తం 303654 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో సాధారణ కనెక్షన్లు 717245 ఉన్నాయి. అదే విధంగా దీపం కనెక్షన్లు 113312 కనెక్షన్లు ఉండగా సీఎస్ఆర్ కనెక్షన్లు 38815 ఉన్నాయి. ప్రస్తుతం రాయితీ వంట గ్యాస్ సిలిండర్ రూ.477.46 గా ఉండగా గ్యాస్ ఏజెన్సీలు రూ.630 వినియోగదారులకు అందజేస్తున్నారు. రూ. 153 సబ్సిడీ డబ్బులను వినియోగదారుల ఖాతాలో జమజేస్తుంది. గ్యాస్ సిలిండర్‌ను ఇంటి వద్దకు తీసుకు వచ్చి సరఫరా చేస్తున్నందుకు గాను అదనంగా రూ. 30 తీసుకుంటున్నారు. ఇప్పటికే భారంగా భావిస్తున్న సామాన్యులకు సబ్సిడీ ఎత్తివేత కారణంగా మరింత భారంగా మారనుంది. జిల్లాలో 303654 గ్యాస్ సిలింజర్లకు గాను నెలకు రూ. 4 పెంచితే వినియోగదారులపై రూ.12 లక్షల భారం పడుతుంది. అలాగే ఏడాది పాటు పెంచిన ధరను లెక్కిస్తే.. రూ. 1.51 కోట్లు భారం పడుతుంది. పెరుగుతున్న నిత్యావసరాలకు ఉక్కిరిబిక్కిరవుతున్న సామాన్యులకు వంట గ్యాస్ మంటగా మారింది. సబ్సిడీ ఎత్తివేస్తుండటంతో మళ్లీ కట్టెల పొయ్యే బెటరనుకుంటున్నారు. వంట చెరుకుకు డిమాండ్ పెరగనుంది.


కట్టెల పొయ్యి బెటర్..



రాయితీ ఎత్తివేస్తే కట్టెల పొయ్యి బెటర్. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. పేదలకు అందించే వంటగ్యాస్ సిలిండర్‌పై రాయితీ కల్పించాలి. రాయితీ విషయంలో ప్రభుత్వం మరోసారి ఆలోచించాలి. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ పై రాయితీ ఎత్తి వేయడం చాలా దారుణాం. ఇప్పటికే పేరిగిన ధరలతో పేద మద్య తరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

పి.హేమలత, గున్‌గల్

ప్రజలపై భారం మోపొద్దు..



కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రాయితీని ఎత్తి వేస్తున్నమని ప్రకటించే ముందు ప్రజల స్థితిగతులను తెలుసుకోవాలి. రెక్కాడితే కాని డొక్కాడని గ్రామీణ ప్రజలపై కేంద్రం గ్యాస్ రాయితీ ఎత్తివేసే దిశగా ప్రకటించడం మంచి పద్దతి కాదు. రాయితీ ఎత్తివేత నిర్ణయం కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సరైనది కాదు. మరోసారి పునరాలోచించాలి. ప్రతి ఒక్కరికి గ్యాస్ తప్పనిసరి. వంట గ్యాస్ లేకుంటే కష్టం. ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ రాయితీని ఎత్తివేయాలనుకోవడం సరైంది కాదు. ఈ విషయంలో మరోసారి ఆలోచించాలి.

హన్మంత్, చేవెళ్ల

సాయిపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు

తాండూరు: పట్టణంలోని సాయిపూర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, రంగారరెడ్డి జిల్లాల స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆర్గనైజర్ వీరమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతాసంపత్, ఐసీడీఎస్ సీడీపీవో వెంకటలక్ష్మీ పాల్గొన్నారు. చిన్నారులకు గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు అందజేశారు.



ఇంటర్వ్యూ



80 శాతం రైతు సమగ్ర సర్వే పూర్తి చేశాం

- ఝాన్సీలక్ష్మీ, టెక్నికల్ ఏవో

తాండూరు రూరల్: వ్యవసాయ శాఖ పరిధిలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో 80 శాతం రైతు సమగ్ర సర్వే నిర్వహించామని, 20శాతం రైతుల పేర్లను నమోదు చేసినట్లు తాండూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ టెక్నికల్ ఏవో ఝాన్సీలక్ష్మీ వెల్లడించారు.

ప్ర: తాండూరు సబ్ డివిజన్ పరిధిలో ఎంత మంది రైతులున్నారు?

జ: తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో మొత్తం 47,589 మంది రైతులున్నారు.

ప్ర: ఇప్పటి వరకు రైతు సమగ్ర సర్వేలో ఎంత మంది పేర్లు నమోదు చేసుకున్నారు?

జ: ఇప్పటి వరకు తాండూరు మండలంలో 7,894 మంది రైతులు, పెద్దేముల్‌లో 9,295మంది, బషీరాబాద్‌లో 8,840 మంది, యాలాలలో 9,054 మంది మొత్తం 35వేల 172 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ప్ర: సమగ్ర సర్వే అయ్యాక ఎంత మంది రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు?

జ: 35,172 మంది రైతులకుగాను 20శాతం రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో పొందుపరిచాం.

పోలీసులకు నెమళ్లు అప్పగింత



పోలీసులకు నెమళ్లను అప్పగిస్తున్న మంబాపూర్ గ్రామస్థులు

పెద్దేముల్: రెండు నెమళ్ళు అనారోగ్యంతో పడిఉండడం గమనించిన గ్రామస్థులు వాటిని పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రం నుంచి మంబాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన వ్యవసాయ పొలంలో రెండు నెమళ్లు పడిపోయి ఉండడం గ్రామస్థులు గమనించారు. వెంటనే వాటిని పట్టుకుని చూస్తే నోట్లో నురగలాగ రావడం గమనించారు. వెంటనే వాటిని తీసుకుని పశువైద్యశాలకు వెళ్ళారు. సాయంత్రం అక్కడ ఎవరు లేకపోడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోయారు. అక్కడ పోలీసులకు అప్పగించారు. అప్పగించిన వారిలో వెంకటయ్య, ఇస్మాయిలప్ప, నర్సిములు ఉన్నారు.

టీఆర్‌ఎస్‌ది మోసపూరిత పాలన



మంతట్టిలో మాట్లాడుతున్న రమేష్

బషీరాబాద్: మేమంతా ఒక్కటిగా ఉన్నాం...నియోజకవర్గం ప్రజానీకం కాంగ్రెస్‌కి అండగా ఉంటూ వస్తున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లతో ఆశీర్వదించాలంటూ తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ ఎం.రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మంతట్టి, రెడ్డిఘనాపూర్, మల్కన్‌గిరి, కాశీంపూర్, బహద్దూర్‌పూర్, గొటిగకలాన్, తదితర గ్రామాల్లో మహరాజుల కుటుంబం ఐక్యత యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన, మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు కుటుంబీకులు నరేష్, రాకేష్, రోహిత్‌తో కలిసి వీధుల గుండా ర్యాలీగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మొదటగా కాంగ్రెస్ హైకమాండ్ టికెట్ నాకిచ్చిందన్నారు. మహరాజుల కుటుంబానికి తప్పా టికెట్ వేరొకరికి రాదన్నారు. ఓ వర్గం(కాంగ్రెస్ పార్టీ)కి చెందిన కొందరు గ్రామాల్లో తమదైన శైలిలో పిచ్చి ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పార్టీ టికెట్ నాకిచ్చినందుకు ప్రజల్లో ఓ వర్గం తిరుగుతూ ఏదో ప్రచారం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ అందరిదని, నేనెవ్వరిని కూడా దూరం చేయలేదన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం, మంత్రి మహేందర్ రెడ్డి మోసపూరిత పాలన చేస్తూ పబ్బం గడుపుకుంటుందన్నారు. ఆ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయన్నారు. మా కుటుంబంలో కొన్ని కారణా ల వల్ల ఒకరికొకరు దూరం కావడం వల్లే ఎమ్మెల్యే పదవి చేజారిపోయిందని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెడు తూ ఒకరిద్దరికి ఇస్తూ మిగతా వారికి మొండి చేయి చూపిస్తున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే రోజులు పోయాయని పార్టీ సీనియర్ నాయకులు ఎం.నరేష్ అన్నారు. రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో లక్షలాదిగా ఇళ్లను కేటాయిస్తే టీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో పదుల సంఖ్యలో కూడా డబుల్‌బెడ్‌రూంలు నిర్మించలేదని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోహిత్, ఎం.నరేష్, మాజీ జెడ్పీటీసీ ఎం.రాకేష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అప్పు, నవాంద్గి పీఏసీఎస్ వైస్ చైర్మన్ రామునాయక్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ఎంపీటీసీ నరేష్‌చౌహాన్, సీనియర్ నాయకులు నర్సిరెడ్డి, రాజరత్నం, పర్వత్‌పల్లి గోపాల్‌రెడ్డి, శివప్రసాద్, ఖాలిద్, సాయిలుగౌడ్, పవన్‌ఠాగూర్, మునీర్, మస్తాన్, సురేష్, మాజీ సర్పంచ్‌లు అంజిలయ్య, శ్రీను, వడ్డె శ్రీను, మునీందర్‌రెడ్డి, జగన్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'నగదురహిత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి'

● జిల్లా ఐకేపీ డీపీఎం శ్రీనివాస్

తాండూరు రూరల్: గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి కేంద్రాలను నిర్వాహకులు నగదు రహిత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఐకేపీ డీపీఎం శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని చెంగోల్, పల్లె ప్రగతి కేంద్రంలో లావాదేవీలను పరిశీలించారు. కేంద్రంలో రోజుకు ఎంత మంది లావాదేవీలు జరుపుతున్నారు, ఎంత మందికి ఖాతాలున్నాయి, ఏటీఎం కార్డులు లేనివారు ఎందరనే విషయాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పల్లెప్రగతి కేంద్రం ద్వారా నగదు రహిత కార్యక్రమాలను గ్రామంలోని మహిళ సంఘాలు, రైతులు, ప్రజా ప్రతినిధులతో భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా హరితహారంపై అవగాహన పెంచి మొక్కలు నాటేందుకు చొరవ చూపాలన్నారు. పల్లెప్రగతి కేంద్రం ద్వారా బ్యాంకు లావాదేవీలు జరుపుకుంటే సమయం ఆదా అవుతుందని, రవాణా ఖర్చులు తగ్గుతాయని, బ్యాంకు సేవలు అభివృద్ధి చెందుతాయని, నిరుపేదలు, మధ్య తరగతి వారు ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలున్నారు.

'ఎమ్మెల్యే టిక్కెట్ విషయంలో పునరాలోచించాలి'

యాలాల: తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం పునరాలోచించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాఘవాపూర్, కమాల్‌పూర్, విశ్వనాథ్‌పూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అధిష్టానం గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరించి ప్రజాభిప్రాయం ఎవరికి ఎక్కువ ఉంటే వారికే టికెట్ కేటాయించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సునితాసంపత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు వీరేశం, సంపత్ కుమార్, భీమయ్య, సర్పంచ్ భీమమ్మ, మైనొద్దీన్, లక్ష్మణ్, ఇర్ఫాన్, అంజిలయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులతో వాసవి క్లబ్ ప్రతినిధులు

తాండూరు రూరల్: పేద విద్యార్థులకు వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ ద్వారా సహాయం అందిస్తామని అధ్యక్షుడు సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గుంతబాస్పల్లి ప్రాథమిక పాఠశాలలో క్లబ్ ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, సంతోష్‌కుమార్ కుమార్తెల జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, నరేష్, సభ్యులు సంతోష్, పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడిపించాలని ఆందోళన



రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

యాలాల: గ్రామాల నుంచి ఆయా రూట్లలో తాండూరుకు వచ్చే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపించాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీనారాయణపూర్‌చౌరస్తాలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కొత్తూరు, దేవనూరు, గోరేపల్లి, సంగెంఖుర్దు, యాలాల, బెన్నూరు గ్రామాలకు చెందిన విద్యార్థులు లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని బస్సులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తుందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో బస్సును వేసే వరకు కదిలేది లేదని భీష్మించు కూర్చున్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ అక్కడికి చేరుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు వేస్తున్నారని సమాచారం తెలపడంతో విద్యార్థులు రాస్తారోకో విరమించారు.

వేతనాలు పెంచాలంటూ ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తాండూరు రూరల్: తాండూరు ఆదర్శ పాఠశాలలో ఔట్ సోర్సింగ్, అవర్లీబెస్ట్ ఉపాధ్యాయులకు వేతనాలు పెంచాలని ఉపాధ్యాయులు, సిబ్బంది మంగళవారం పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. సంవత్సరకాలంగా రూ.7500లకే పనిచేస్తున్నామని, వేతనాలు పెంచాలని పలు మార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 25 నుంచి విధులకు హాజరు కాకుండా నిరసన వ్యక్తం చేసేందుకు నిర్ణయించామని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే జీతాలు పెంచేలా కృషి చేయాలని కోరారు. నిరసన అనంతరం ప్రిన్సిపాల్‌కు ఉపాధ్యాయులంతా వినతి పత్రం అందజేశారు

కేజీబీవీని సందర్శించిన ఎంఈవో

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఐనెల్లి గ్రామ శివారులో ఉన్న కస్తూర్భ గాంధీ గురుకుల పాఠశాలను ఎంఈవో వెంకటయ్య మంగళవారం సందర్శించారు. నైట్ వాచ్‌మెన్ విధులు ఎలా నిర్వరిస్తున్నారు, విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతున్నాయనే విషయాలపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీపంలోని మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఐదో తరగతి విద్యార్థులకు కనీస సామర్థ్యాలు కూడా రాకపోవడంతో ఉపాధ్యాయులపై మండిపడ్డారు. మరో నెలల్లో పాఠశాలను సందర్శిస్తానని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

శిశుగృహలో చిన్నారులకు భోజనం

తాండూరు: పట్టణంలోని శిశుగృహలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. భర్త స్వర్గీయ వెంకటయ్య పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. శిశుగృహకు ఇన్వర్టటర్ ఇచ్చేందుకు హామీ ఇచ్చారు.

కస్తూర్భా పాఠశాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

పెద్దేముల్: కుళ్ళిపోయిన కూరగాయలు, నీళ్ళలాంటి పప్పుచారు. ఇలాగేనా విద్యార్థులకు భోజనం అందజేసేదని ఎంపీటీసీ విద్యాసాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌషికాహారం పెట్టమంటే నాసిరకం భోజనం ఎందుకు పెడుతున్నారని మండిపడ్డారు. మండలంలోని మారెపల్లి గ్రామ సమీపంలో గల కస్తూర్భా గాంధీ బాలికల పాఠశాలను మంగళవారం ఎంపీటీసీతో కలిసి కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు నరేష్‌రెడ్డి, శిబ్లి, పెంటయ్య పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి హామీ..!


వికారాబాద్ మండల పరిధిలోని పీరంపల్లి గ్రామం వ్యూ

- పథకాలను సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి

వికారాబాద్ అర్బన్ : ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూస్తే ఏ పని కాదు.. అందుబాటులో ఉన్న నిధుల్ని అమలులో ఉన్న పథకాల్ని సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగులేస్తాయి. అనుకున్న మేరకు ప్రగతిని సాధించవచ్చు. పంచాయతీలకు మంజూరయ్యే అరకొర నిధులతో ఏ పనులు పూర్తిచేసుకోలేని పరిస్థితి ఉన్నందున సర్పంచులు నిరుత్సాహపడకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుంటే మేలు జరుగుతుంది. పల్లెలు ప్రగతి బాట పట్టడంతోపాటు కూలీలకు ఉపాధి చూపట్టినట్లు అవుతుంది. వికారాబాద్ మండలంలో 21గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ జాబ్‌కార్డులు కలిగిన కూలీలు 8485 మంది ఉన్నారు. 698 శ్రమశక్తి సంఘాలున్నాయి. ప్రస్తుతం రోజువారికి 5350మంది కూలీలు ఉపాధి పథకం పనుల్లో పాల్గొంటున్నారు. వీరి ద్వారా గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం, పర్యావరణ,ం భూగర్భజలాల పెంపు, మౌలిక, సదుపాయాల్ని సమకూర్చుకోవచ్చు. అవసరాలకు తగినట్టు ప్రణాళికను రూపొందించుకుని ముందుకు సాగితే ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. గతంలో పోలిస్తే ఉపాధి హామీ పథకంలో కొన్ని మార్పులు చేశారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం తదితర వాటికి ప్రాధాన్యం కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధికి గల అవకాశాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

స్వచ్ఛ పల్లెలుగా మారుద్దాం..

పల్లెలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధి హామీ పథకంలో అవకాశం ఉంది. చెత్తాచెదారం ఒకచోట నిల్వ చేసేందుకు వీలుగా డంపింగ్ యార్డులను నిర్మించుకోవచ్చు. దీనికి ప్రత్యేకంగా కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వారితో పనులు చేయించుకోవాలి. పైగా గ్రామాల్లోని చెత్తను సేకరించేందుకు నెలకు 15రోజుల చొప్పున ఏడాదిలో 150రోజులు చెత్త రవాణాకు నెలకు నాలుగు పనిదినాల చొప్పున 48రోజులకు ఉపాధి హామీ పథకం కింద వేతనం చెల్లించడానికి వీలుంది. ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేయవచ్చు. దీంతోపాటు ఇళ్లల్లో మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు రూ.12వేలు చెల్లిస్తున్నారు. గతంలో కాకుండా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన గుంతల్ని ఉపాధి హామీ పథకం కింద తవ్వించుకునే వీలుంది. దీనికి ముందుగా గ్రామాల్లో సర్వేచేసి అవసరమైనవారి వివరాలతో మండల అభివృద్ధి అధికారి నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది.

మొక్కలు నాటుదాం..

ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటేందుకు అనేక అవకాశాలున్నాయి. హరితహారంలో భాగంగా గ్రామాన్ని పచ్చదనంతో నింపేయవచ్చు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం కాపాడడమేకాకుండా ప్రశాంత వాతావరణాన్ని పెంపొందించినవారవుతారు. రైతుల భూములతోపాటు పాఠశాలల్లో రోడ్డుకి ఇరువైపులా పంచాయతీ ఆవరణల్లో మొక్కలు నాటుకోవచ్చు. ఉద్యాన మొక్కలు చల్లని నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి. మండలాల్లోనే నర్సరీలు ఏర్పాటుచేసి ఉచితంగా మొక్కల సరఫరా చేస్తున్నారు. గుంతలు తవ్వేందుకు మొక్కలు నాటేందుకు వాటి పోషణకు కూడా ఉపాధి హామీ పథకం నుంచి డబ్బు చెల్లిస్తారు. కూలీలను గుర్తించి వారికి బాధ్యతను అప్పగించడంతోపాటు సకాలంలో డబ్బు అందేలా సర్పంచులు పర్యవేక్షిస్తే గ్రామాలు హరితమయమవుతాయి.

సేంద్రియ ఎరువు..

రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా ఉపాధి పథకం కింద కంపోస్టు యూనిట్ల ఏర్పాటుకు వీలుగా తవ్వకాలు చేసుకోవచ్చు. ఇందుకు ప్రత్యేకంగా పథకం కింద నిధులున్నాయి. ఆసక్తి గల రైతులను గుర్తించి పొలాల్లో కంపోస్టు గుంతలను ఏర్పాటుచేస్తే సేంద్రియ ఎరువు ఉత్పత్తి చేసుకోవచ్చు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ఉపాధి పథకం కింద నిధులు కేటాయించే అవకాశం ఉన్న నేపథ్యంలో విరివిగా తవ్వించి సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేసుకునేందుకు వీలుగా రైతుల్ని ప్రోత్సహించవచ్చు. కూరగాయల్ని సాగు చేసేవారు వీటిని ఏర్పాటు చేసుకుంటే నాణ్యమైన ఉత్పత్తులు పండించవచ్చు.

పూడికతీత..

గ్రామాల్లోని చెరువులు, చెక్‌డ్యామ్‌లు, ఊట కుంటలు కాల్వల్లో పూడిక తీసుకునే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదించి కూలీలతో పనులు చేయిస్తే అటు వారికి ఉపాధి చూడపంతో పాటు నీటి వనరులు బాగవుతాయి. సాగు భూములకు నీరందించడంతోపాటు నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. మిషన్ కాయతీయలో లేని చెరువులు ఇతర చిన్ననీటి వనరుల్ని ఉపాధి హామీ పథకం కింద బాగుచేసుకోవడానికి ఇది సరైన సమయం. నీటి వనరులు ఉన్న గ్రామాల సర్పంచులు వీటిపై దృష్టి సారించి పూర్తిచేయించాలి. రూ.లక్షల వ్యయంతో అయ్యే పనులు కూలీలతో చేయిస్తే వారికి పని కల్పించినట్లవుతుంది.

దారి చూపండి..

గ్రామం నుంచి ఇతర గ్రామాలు, పంట పొలాలు ఇలా దారులు లేని ప్రాంతాలకు ఉపాధి హామీ పథకం కింద రోడ్లు వేసుకునే అవకాశం ఉంది. గ్రామాల వారీగా ప్రాధాన్యమున్న రోడ్లను గుర్తించి వివరాలతో ప్రణాళిక రూపొందించిన ఎంపీడీవో అనుమతి తీసుకోవాలి. గుర్తించిన దారికి ఇరువైపులా మట్టిని తవ్వి రోడ్లు వేసుకోవాలి. ఇలా ఎడ్ల బండ్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది. తర్వాత ఇతర నిధులతో మొరం ఆ తర్వాత బీటీ రహదారులుగా మార్చుకోవచ్చు. ఇందుకుగాను రైతులు ఇబ్బందిపడుతున్న మార్గాలను గుర్తించి వాటిని ఉపాధి హామీ పథకం కింద పూర్తి చేసుకుంటే గ్రామస్థులకు దారి చూపిన వారవుతారు. ఇందులో కొంత కూలీలతోపాటు యంత్రాలకు సంబంధించిన పని ఉండడం వల్ల వాటిని కొంత శాతం మేరకు ఉపయోగించుకునే వీలుంది.

ఇంకుడు గుంతలు..

ఉపాధి హామీ పథకం నిధులతో ఇంకుడు గుంతలు నిర్మించుకోవచ్చు. గ్రామంలోని జాబ్‌కార్డు ఉన్న వారు ఎవరైనా తమ ఇంటి వద్ద ఇంకుడుగుంత నిర్మించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఒక గుంతకు రూ.4095 చెల్లిస్తుంది. వీటిని నిర్మించుకోవడం ద్వారా వృథా నీటిని భూమిలో ఇంకించి ఎద్దడిని నివారించవచ్చు. దీని ద్వారా కూలీలకు పనితోపాటు భూగర్భంలో నీటి మట్టం పెంచుకోవచ్చు.

నీటి నిల్వ..

వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ భూముల్లో కాంటూరు కందకాలు, మినీ ఊట కుంటలు, నీటి నిల్వ కందకాలు ఫాంపండ్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి వీలుంది. గ్రామ సమీపంలో నీటిని ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుంది. ఎక్కడెక్కడ ఎవరి భూముల్లో నిర్మించాలనేది ముందుగా గుర్తించి ప్రతిపాదనలు రూపొందించుకుంటే పకడ్బందీగా పనులు పూర్తిచేసుకోవడానికి వీలుంది. 75 మీటర్ల పొడవు అవసరమైన మేరకు లోతు నిర్మించుకోవచ్చు. గ్రామంలో ఎన్ని ఎక్కువ నిర్మించుకుంటే అంత నీరు భూమిలో ఇంకుతుంది.

ప్రైవేట్ విద్య కలేనా.?




- విద్యాహక్కు చట్టం కింద ఊసేలేని 25 శాతం సీట్ల కేటాయింపు
- పేదలకు ప్రైవేట్ విద్య అందని ద్రాక్షేనా.?
- యథేచ్ఛగా ఫీజుల వసూళ్లు
- పట్టించుకోని అధికారులు

పరిగి: విద్యాహక్కు చట్టం ప్రకారం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సి ఉంది. అయితే ఈ చట్టం వచ్చి ఏడేళ్లు కావస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరడం లేదు. ప్రత్యేకించి ప్రైవేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కల్పించాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఈ చట్టం అమలు జరిగితే ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో పేదల పిల్లలకు చదువు కల నేరవేరనుంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్పందించి అమలు చేయాలని పేద పిల్లల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన రోజు కూడా పేదలకూ ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పిన సంగతి విధితమే. గత ఏడాది దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్పటీ కేంద్ర ప్రభుత్వంపై మెట్టికాయలు వేసిన ఫలితం లేకుండా పోయింది. అయినా అమలులో అందనంతా దూరంగా ఉంది. విద్యాహక్కు చట్టాన్ని ఖచ్చితంగా బాధ్యాతాయుతంగా నిర్వహించాల్సిన అధికార యంత్రాంగం వైఫల్యం వల్లనే ఈ చట్టం అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. న్యాయస్థానం ఆదేశించడం వల్ల విద్యా సంవత్సరం అమలు జరుగుతుందని ఆశించారు కానీ, ఆశలు నిరాశాలుగానే మిగులుతున్నాయి. 2017-18 విద్యాసంవత్సరం ప్రారంభమైంది. అయితే అంతకు ముందుగానే జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థలన్ని తమ సీట్లన్నింటిని ప్రైవేట్ ఫీజులతో భర్తీ చేసుకుంటున్నాయి. కొన్ని విద్యా సంస్థలు నిబంధనలకు మించి కూడా ఎక్కువగా చేసుకుంటున్నాయి. అయితే ఎక్కడా కూడా ఉచితంగా పేదలకు సీట్లు ఇచ్చిన దాఖలాలు లేవు. అయితే దీనిపై ఏడాది కాలం ప్రభుత్వం నాన్చుడిదోరణిని అవలంభించడం కూడా ఒక కారణమని విద్యారంగా విశ్లేషకులు బావిస్తున్నారు. ఫలితంగా పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్యను అందని ద్రాక్షలా మారిపోతుందని చెప్పవచ్చు.

అమలైతే వేలాది మందికి లబ్ధి

న్యాయస్థానం తీర్పును అనుసరించి కేంద్రప్రభుత్వం తక్షణమే దీనిపై మార్గదర్శకాలు జారీచేస్తే జిల్లాలో వేలాది మంది పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో వందకుపైగా ప్రైవేట్ విద్యా సంస్థలు ఉంటాయి. వీటి పరిధిలో దాదాపుగా 40వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతుంటారు. అయితే వీటి వల్ల 25 శాతం సీట్లు పేద పేద విద్యార్థులకోసం కేటాయిస్తే దాదాపుగా పదివేల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. ఇందులో కూడా రిజర్వేషన్ల వారిగా ఎంపిక చేయాలని సూచించింది. విద్యాహక్కు చట్టం నిర్దేశించిన విధంగా అనాథలు, ఎయిడ్స్ బాధితులకు ఐదు శాతం. ఎస్సీలకు 10 శాతం, గిరిజనులకు నాలుగుశాతం, బీసీలకు ఆరుశాతం సీట్లను కేటాయించింది. ఈ విద్యార్థుల ఎంపిక విద్యాశాఖ అధికారులు, పాఠశాల యజమాన్యాల నిర్వహణ కమిటీ సమక్షంలో ఎంపిక చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల ఎంపిక గురించి గతంలో సుప్రీం కోర్టు కూడా సూచించింది. దీనికితోడు ఈ పిల్లలను ఇతర విద్యార్థులతో సమానంగా కూర్చోబెట్టడంతోపాటు, అన్ని రకాల వసతులన్ని సరి సమానంగా అందించాల్సి ఉంటుంది. అయితే కేవలం వ్యాపార దృకృథంతో పని చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు దీన్ని అసలు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ పాటశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రతి ఏడాది ప్రత్యేక టాస్క్‌ఫోర్సు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నది. ఈ కమిటీ సిపార్సుగానే మిగిలిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

విద్యహక్కు చట్టాన్ని అమలు చేయాలి



ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం పేద విద్యార్థులు ఉచిత విద్యను అందించాలని నిబంధనలు ఉన్నప్పటీకీ జిల్లాలోని ఏ ఒక్క పాఠశాల కూడా అమలు చేయడం లేదు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులను ఫీజుల పేరిటి దోపిడీకి గురి చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తే జిల్లాలో 10 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. జిల్లా కలెక్టర్, డీఈవో ఈ విషయంపై చొరవ తీసుకుని ఖచ్చితంగా చేస్తే పేదల విద్యార్థులకు లాభం జరుగుతుంది.

-లాల్‌కృష్ణప్రసాద్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు

మొహం చాటేసిన వరుణుడు




బొంపల్లితండాలో ఎండుతున్న మొక్కజొన్న

నీరుచేరని జలాశయాలు

ఎండుతున్న పంటలు

ఆందోళనలో అన్నదాతలు

పరిగి: ఖరీఫ్‌లో ఇప్పటి వరకు సాధారణానికి మించిన వర్షపాతం నమోదైనప్పటికీ రైతుల్లో కలవరం మొదలైంది. వాతావరణంలో మార్పులు, చిన్నపాటి వర్షం కురుస్తున్నప్పటికీ పంటలకు సరిపోవడం లేదు. నల్లరేగడి భూముల్లో పంటలు కాస్త బాగున్నప్పటికీ చెలక భూముల్లో మొక్కజొన్న తదితర పంటలు ఎండుముఖం పడుతున్నాయి. జూన్‌లో కుసిరిసిన వర్షాలు, జూలైలో కానరాకుండా పోయాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి మేఘాలు కుమ్ముకుని ఊరిస్తూ చిన్నపాటి వర్షాలే తప్పా, వాగులు పారే వర్షాలు కురియలేదు. జిల్లాలో అక్కడక్కడ వానలు కురుస్తున్నా పరిగి నియోజకవర్గంలో మాత్రం చినుకు జాడ లేకుండా పోయింది. అన్నదాతల ఆశల్లో వరుణుడు నిప్పులు చల్లుతున్నాడు. మొదట్లో కురిసిన వానలకు నల్లరేగడి, చెలక నేలల్లో రైతులు విత్తుకున్నారు. కలుపు తీత పనులు కూడా అయిపోయాయి. పంటలన్నీ ఏపుగా కనిపిస్తున్నాయి. వర్షం లేక నేలకొరుగుతున్నాయి. పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో జొన్న, మొక్కజొన్న, పత్తి సాగు సాధారణం కంటే ఎక్కువగానే చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పూడూరు, పరిగి మండలాల్లో కొన్ని రోజుల వరకు తట్టుకుంటాయి కానీ, దోమ, కులకచర్ల మండలాల్లో మొక్కజొన్న, జొన్న, పత్తి పంటలు ఎండిపోతున్నాయి. దోమ మండలం బాసుపల్లి, బొంపల్లి, గోడుగోనిపల్లి, మోత్కూర్, మైలారం, కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్, కామునిపల్లి, అంతారం, పుట్టపహాడ్, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. మరో వారం రోజులు వానలు కురియకపోతే ప్రధానంగా మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. వానదేవుడు కురుణిస్తాడేమోనని అన్నదాతలు ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు.



చుక్కనీరు లేని పుట్టపహాడ్ చెరువు

ఊరిస్తున్న మేఘాలు.. జాడలేని చినుకులు

ఊరిస్తున్న మేఘాలు, ముదురుతున్న ఎండలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సన్నపాటి వర్షాలు కాపాడుతూ వస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకు ఏ ఒక్క చెరువు కుంటల్లోకి నీరు చేరిన దాఖలాలు లేవు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ సీజన్ జూన్ మాసంలో కురిసిన వర్షాలకు ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారు. తీరా జూలై నుంచి ఇప్పటి వరకు పరిస్థితి తలకిందులైంది.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

పరిగి సబ్ డివిజన్‌లోని పరిగి, దోమ, కులకచర్ల మండలాల్లో 200లకుపైగా చెరువు, కుంటలు ఉన్నాయి. గత సంవత్సరం కూడా వర్షాలు ఆశించిన స్థాయిలో కురువక చెరువు, కుంటలు నిండలేదు వాటి కింద పంటల సాగుకు నోచుకోలేదు. చెరువుల కింద ఈ సారి కూడా పంట సాగుబాటుకు నోచుకునే పరిస్థితి లేదు. వర్షాలు కురవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. సబ్ డివిజన్‌లోని ప్రధానంగా లక్నాపూర్, అంతారం పాటిమీద చెరువు, రాయన్‌చెరువు, ఇబ్రహీంపూర్, దోమ పెద్దచెరువు, ఐనాపూర్, కిష్టాపూర్, ముజాహిద్, కులకచర్ల తదితర చెరువుల్లో ఇంకా నీరు చేరలేదు. అయితే ఆయా గ్రామాల్లోని రైతులు వరుణుడి కోసం పూజలు చేస్తున్నారు.



వర్షం కోసం భజన చేస్తున్న మహిళలు

వర్షాల కోసం పూజలు..

కొడంగల్: వర్షాలు కురవాలి వరుణ దేవుడా...పంటలు సమృద్ధిగా పండాలి వరుణుడా అంటూ భజనలతో వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని వడ్డర్‌గల్లీ చితారుపెరుమాళ్ల ఆంజనేయస్వామి భజన మండలి తదితర కాలనీలకు చెందిన ప్రజలు వర్షాల కోసం కొడంగల్ నుంచి సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయం వరకు భజనతో వరుణ దేవుడిని స్మరిస్తూ తరలి వెళ్లారు. ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వరుణ దేవుడిని ప్రార్థించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలతో పాటు భజనలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు సాగు చేసిన పంటలు వర్షాలు లేక ఎండుముఖం పట్టడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 20 రోజులకుపైగా వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు నష్టానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు వివిధ గ్రామాల్లో వరుణ దేవుడి కరుణ కోసం భజనలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

మొక్కజొన్న ఎండిపోతున్నది



మంత్రి మహిపాల్, రైతు, బాసుపల్లి

మొదట్లో వర్షాలు మురిపించాయి. ఆశతో పంటల సాగుకు వేలాది రూపాయల అప్పులు చేసి మొక్కజొన్న సాగు చేశా. పంట ఏపుగా వచ్చి మురిపిస్తున్నది. వర్షాకాలం ఉసూరు మనడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. రెండు, మూడు రోజుల్లో వర్షం కురిస్తే పంట ఉంటుంది. ఆలస్యం అయితే పంటలపై ఆశలు వదులుకోవాల్సిందే.

నేటినుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

జోనల్ స్థాయి ఆటల నిర్వహణకు రంగం సిద్ధం

వారాంతం వరకు సాగనున్న పోటీలు

వికారాబాద్ ఫీచర్స్ : జిల్లాలో నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడల సందడి మొదలు కానుంది. బుధవారం నుంచి వారం రోజుల పాటు ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సంబంధిత అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర క్రీడా విభాగాల్లో ఆయా మండలాల నుంచి వచ్చే జట్లకు పోటీలను నిర్వహించనున్నారు. ఈ క్రీడల నిర్వహణకు సౌలభ్యంగా ఉండేందుకు క్రీడాశాఖ అధికారులు జిల్లాలోని 18 మండలాలను వికారాబాద్, పరిగి, ధారూరు, కొడంగల్, తాండూరు, మోమిన్‌పేట్ జోన్లుగా విభజించారు. మొత్తం 6 జోన్లు ఉండగా ఒక్కో జోన్ పరిధిలో మూడేసి మండలాలున్నాయి. పోటీలు ముగిశాక సంబంధిత మండలాల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సంబంధిత క్రీడల్లో జోన్ జట్లకు ఎంపిక చేస్తారు.

క్రీడల నిర్వహణలో కొత్త విధానం

జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడిగా ఉన్న రంగారెడ్డి జిల్లాలో ప్రతీ నియోజకవర్గాన్ని ఓ జోన్‌గా భావించే వారు. అప్పట్లో ముందుగా జోన్‌ల వారీగా క్రీడలను నిర్వహించి తర్వాత నేరుగా రంగారెడ్డి జిల్లా స్థాయిలో క్రీడలను నిర్వహించే వారు. అనంతరం 10 జిల్లాల జట్లతో రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణ జరిగేది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లాలు ఉండడంతో కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాలో గల 6 జోన్లలో ముందుగా క్రీడలను నిర్వహిస్తారు. అనంతరం జోన్లవారీగా ఆయా క్రీడల్లో ఎంపికైన జట్లనన్నింటినీ కలిపి వికారాబాద్ జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తారు. ఇందులో క్రీడాకారులు కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఆయా విభాగాల్లో వికారాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేస్తారు. ఇదే తరహాలో ఎంపిక చేసిన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల జట్లతో వికారాబాద్ జిల్లా జట్లను కలిపి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి క్రీడలను నిర్వహిస్తారు. ఆ పోటీల్లో ప్రతిభ ఆధారంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు. అన్ని రకాల క్రీడలకూ ఇదే పద్ధతి పాటిస్తారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

రెండో వారంలో వికారాబాద్ జిల్లా స్థాయి క్రీడలు

ఆగస్టు మొదటి వారంలో జోనల్ స్థాయి క్రీడలు ముగిశాక రెండు లేదా 3వ వారంలో వికారాబాద్ జిల్లా స్థాయి క్రీడలను నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ పోటీలు ముగిశాక ఆగస్టు చివరికల్లా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నారు. అయితే పరిస్థితులను బట్టి షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది.

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. **చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక**
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. **విటమిన్ ఎ : రేచీకటి :: ------ : రికెట్స్**
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. **పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----**
ఎ) కెరొటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. **ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------**
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : **ఎ**
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. **రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------**
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: **సి**
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. **పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------**
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
